بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيمِ — نَحْمَدُهُ وَنُصَلِّي عَلَى رَسُولِهِ الْكَرِيمِ — وَعَلَى عَبْدِهِ الْمَسِيحِ الْمَوْعُودِ

وَلَقَدْ نَصَرَكُمُ اللهُ بِبَدْرٍ وَّأَنْتُمْ أَذِلَّةٌ

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR** Qadian

సంపుటి: 11 సంచిక: 26

www.akhbarbadr.in

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

తేది: 25 జూన్ 2026 క్రీ, శ. 25 ఎహ్సాన్ 1405 హి, శ. 08- ముహర్రం 1448 హి,ఖ.


## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

تِلْكَ آيَاتُ اللهِ نَتْلُوهَا عَلَيْكَ بِالْحَقِّ فَبِأَيِّ حَدِيثٍ بَعْدَ اللهِ وَآيَاتِهِ يُؤْمِنُونَ (الجاثية:٧)

అనువాదం: ఇవి అల్లాహ్ సూక్తులు. వాటిని మేము మీ ముందు సత్యముతో చదివి వినిపించెదము. అల్లాహ్, అతని సూక్తుల తరువాత వారు మరే విషయమును విశ్వసించెదరు?. (జాసియా :7)

وَمَا آتَاكُمُ الرَّسُولُ فَخُذُوهُ وَمَا نَهَاكُمْ عَنْهُ فَانْتَهُوا وَاتَّقُوا اللهَ إِنَّ اللهَ شَدِيدُ الْعِقَابِ (الحشر:٨)

అనువాదం: ఇది మీ గొప్ప వారి మధ్యనే తిరుగుచు ఉండరాదు. ప్రవక్త మీకు నొసంగిన దానితో తృప్తి పడుడు. మిమ్ములను ఆపు దాని నుండి దూరముండుడు. అల్లాహ్‌కు భయపడుడు. నిశ్చయముగా అల్లాహ్ శిక్షించుటలో చాలా కఠినుడు. (హషర్:8)

## వివాదముల పరిష్కారములకు స్పష్టమైన కార్యాచరణ.

أَنَّ رَسُولَ اللهِ ﷺ لَمَّا أَرَادَ أَنْ يَبْعَثَ مُعَاذًا إِلَى الْيَمَنِ قَالَ كَيْفَ تَقْضِي إِذَا عَرَضَ لَكَ قَضَاءٌ. قَالَ أَقْضِي بِكِتَابِ اللهِ قَالَ فَإِنْ لَمْ تَجِدْ فِي كِتَابِ اللهِ قَالَ فَبِسُنَّةِ رَسُولِ اللهِ ﷺ قَالَ فَإِنْ لَمْ تَجِدْ فِي سُنَّةِ رَسُولِ اللهِ قَالَ أَجْتَهِدُ بِرَأْيِي وَلَا آلُو فَضَرَبَ رَسُولُ اللهِ ﷺ صَدْرَهُ فَقَالَ الْحَمْدُ لِلَّهِ الَّذِي وَفَّقَ رَسُولَ رَسُولِ اللهِ ﷺ لِمَا يُرْضِي رَسُولَ اللهِ.

(ابوداؤد كتاب القضاء باب اجتهاد الرأي في القضاء)

దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు ముఆజ్ బిన్ జబల్ (రజియల్లాహు అన్హు) గారిని యెమెన్‌కు పంపాలని నిర్ణయించినప్పుడు, వారిని ఇలా అడిగారు: “నీ ముందుకు ఏదైనా వివాదం లేదా కేసు వచ్చినప్పుడు, నీవు ఎలా తీర్పు ఇస్తావు?” అందుకు ముఆజ్ (రజి) ఇలా సమాధానమిచ్చారు: “నేను అల్లాహ్ గ్రంథమైన ఖుర్ఆన్ ప్రకారం తీర్పు ఇస్తాను.” అప్పుడు అల్లాహ్ ప్రవక్త (స) ఇలా అడిగారు: “ఒకవేళ అల్లాహ్ గ్రంథంలో ఆ విషయానికి సంబంధించిన తీర్పు నీకు దొరకకపోతే?” అందుకు వారు ఇలా సమాధానమిచ్చారు: “అప్పుడు అల్లాహ్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి సున్నత్ ప్రకారం తీర్పు ఇస్తాను.” అప్పుడు ప్రవక్త (స) మరల ఇలా అడిగారు: “సున్నత్‌లో కూడా నీకు తీర్పు దొరకకపోతే?” అందుకు ముఆజ్ (రజి) ఇలా అన్నారు: “అప్పుడు నేను నా స్వీయ విచక్షణ (ఇజ్తిహాద్)ను ఉపయోగించి, ఎటువంటి నిర్లక్ష్యానికి పాల్పకుండా, నా శక్తిమేరకు సరైన నిర్ణయం తీసుకోవడానికి కృషి చేస్తాను.” ఇది విన్న అల్లాహ్ ప్రవక్త (స) వారి ఛాతిపై మృదువుగా తట్టి ఇలా అన్నారు: “అల్లాహ్‌కే సర్వ స్తుతులు. తన ప్రవక్తకు ప్రతినిధిగా వెళ్లే ఈ వ్యక్తికి, అల్లాహ్ ప్రవక్త (స)ను సంతోషపరిచే విధముగా నిర్ణయం తీసుకునే భాగ్యమును (సామర్థ్యం, మార్గదర్శకం) ప్రసాదించిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు.”

## అహ్మదియ్య ముస్లిం జమాఅత్ దృష్టిలో ఖుర్ఆన్, సున్నత్ మరియు అహాదీస్‌ల స్థానం.

(ఉపదేశములు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం)

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ ( మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని గారు) అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు:**

“సన్మార్గమును స్పష్టంగా తెలియజేయడానికే నేను ఈ వ్యాసంను రాశాను. ఇస్లామీయ మార్గదర్శకత్వాన్ని అనుసరించేందుకు ముస్లింలకు మూడు ఆధారాలు ఉన్నాయి: (1) పవిత్ర ఖుర్ఆన్ :- ఇది అల్లాహ్ యొక్క గ్రంథం. దీని కంటే ఎక్కువ నిశ్చయమైన, ఖచ్చితమైన మరియు తుది ప్రమాణమైన వాక్యం మన వద్ద లేదు. ఇది దేవుని వాక్యం. సందేహం మరియు ఊహాగానాల కలుషితాల నుండి పూర్తిగా స్వచ్ఛమైనది. (2) సున్నత్:- ఇక్కడ మేము అహ్లే హదీస్ వారు వాడే పరిభాషకు భిన్నంగా ఉన్నాము. అనగా, సాధారణ నామమాత్రపు హదీస్ పండితులు చెప్పే విధముగా, మేము హదీస్ మరియు సున్నత్‌ను ఒకటే అంశంగా పరిగణించడం లేదు. నిజానికి హదీస్‌కు ఒక ప్రామాణికత ఉన్నది, సున్నత్‌కు మరొక ప్రామాణికత ఉన్నది. సున్నత్ అనగా, అల్లాహ్ యొక్క ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఆచరణాత్మక జీవన విధానం. ఇది నిరంతర పరంపరగా మరియు తరతరాలుగా కొనసాగుతూ వచ్చింది. ఇది ఖుర్ఆన్‌తో పాటుగా ప్రారంభమై ఉనికి లోకి వచ్చింది మరియు ఎల్లప్పుడూ ఖుర్ఆన్‌కు తోడుగానే ఉంటుంది. మరొక విధంగా చెప్పాలంటే, పవిత్ర ఖుర్ఆన్ అల్లాహ్ యొక్క వాక్యం కాగా, సున్నత్ అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)గారి కార్యాచరణ. ప్రవక్తలు (అలైహిముస్సలాంలు) ప్రజల మార్గదర్శకత్వం కోసం దేవుని వాక్యాన్ని తీసుకొచ్చి నప్పుడు, ఆ వాక్యాన్ని తమ ఆచరణల ద్వారా వివరిస్తారు. తద్వారా ప్రజలకు ఆ బోధనల సందిగ్ధత దూరమైపోతుంది. ఫలితముగా ప్రజలు కూడ స్వయంగా ఆ బోధనలను అనుసరిస్తారు మరియు ఇతరులతో కూడా అనుసరింపజేస్తారు. (3) మూడవ మార్గదర్శక ఆధారం హదీస్:- హదీస్ అనగా, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి కాలం తరువాత సుమారు నూట యాభై సంవత్సరాల అనంతరం, వివిధ కథకుల ద్వారా సేకరించబడిన కథల రూపంలో ఉన్నటు వంటి ప్రవక్త (స) గారి వాక్యములు. కాబట్టి, సున్నత్ మరియు హదీస్ మధ్య తేడా ఏమిటనగా, సున్నత్ అనేది అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా స్థాపించిన ఒక ఆచరణాత్మక విధానం. ఇది నిరంతర పరంపరగా కొనసాగుతూ వచ్చింది. నిశ్చయత పరంగా ఇది పవిత్ర ఖుర్ఆన్ తరువాత రెండవ స్థానంలో ఉంటుంది. కావున ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎలాగైతే ఖుర్ఆన్ ప్రచారం కోసం నియమించబడ్డారో, అదే విధంగా సున్నత్‌ను స్థాపించి, దానిని ఆచరింపజేసేందుకు కూడా నియమించబడ్డారు.”

**(రివ్యూ ముబాహిస బటాల్వీ వ చక్డాల్వీ, రూహాని ఖజాయిన్, సంపుటి 19, పుటలు 209-212).**

## సున్నత్ అనేది ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా నిరంతరం ఆచరించిన మరియు ఇతరులను కూడా ఆచరించమని ప్రోత్సహించిన కార్యాచరణ. అయితే హదీస్ అనేది ప్రవక్త (స)పలికిన మాటలు లేదా చేసిన బోధన.

సయ్యదినా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ ఖలీఫతుల్ మసీహుస్సాని (రజి ) గారు సయ్యదినా హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (మిర్జా గులామ్ అహ్మద్) అలైహిస్సలాం గారి ధార్మికపరమైన సేవలను గూర్చి వివరిస్తూ, ఇలా పేర్కొన్నారు:

“సయ్యదినా హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) చేసిన పదవ గొప్ప సేవ, ఇస్లామీయ న్యాయశాస్త్రం (ఫిఖ్అ) యొక్క సంస్కరణ. ఆ కాలంలో ఫిఖ్‌ఆలో తీవ్రమైన లోపాలు ఏర్పడ్డాయి మరియు హద్దులే లేనంతగా విపరితమైన భేదాభిప్రాయాలు పెరిగిపోయాయి .కాబట్టి ఈ విషయానికి సంబంధించి హుజూర్ (అ) ఒక సువర్ణ సూత్రాన్ని ప్రతిపాదించి, షరీయ్యత్ యొక్క పునాదులు ఈ క్రింది విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. (1) పవిత్ర ఖుర్ఆన్ (2) ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సున్నత్ (3) ఖుర్ఆన్, సున్నత్ మరియు వివేకానికి విరుద్ధంగా లేని హదీస్‌లు (4) ధార్మిక పరిజ్ఞానం మరియు ధర్మం పట్ల లోతైన అవగాహన కల్గియుండడం. (5) మానవుల స్వభావాలు మరియు పరిస్థితులలోని భేదాలు. సున్నత్ మరియు హదీస్‌లను వేరు వేరు చేసి స్పష్టమైన తేడాను చూపించడం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు చేసిన గొప్ప సేవలలో ఒకటి. (11 వ పేజిలో చదువుము)

**అహ్మదియ్య వార్తలు**

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన, దీర్ఘాయుష్షును ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుగాకా!, దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*


జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

**సంపాదకీయం:** لَا اِلٰهَ اِلَّا اللّٰهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰهِ

## అహ్లే ఖుర్ఆన్, అహ్లే హదీస్ వర్గాల విభేదాలు
## మరియు
## న్యాయాధిపతి మరియు ధర్మనిర్ణేత అయినా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి విశ్వాసభరిత పరిష్కారాలు.

నేటి రోజుల్లో సౌదీ అరేబియాకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి. వాటి ప్రకారం, చట్టాల రూపకల్పన విషయంలో సౌదీ అరేబియా ముతవాతిర్ హదీస్ (అనేక స్వతంత్ర మార్గాల ద్వారా నిరంతరంగా ఆచరించబడే హదీస్‌లు) తప్ప మిగతా అన్ని హదీస్‌లను అనుమానాస్పదమైనవిగా, నమ్మదగనివిగా పరిగణించి తిరస్కరించిందని చెబుతున్నారు. సాధారణ ముస్లింల భావోద్వేగాలను రెచ్చగొట్టి చవకబారు ప్రచారం పొందడానికి సోషల్ మీడియాలో నిరంతరం ప్రయత్నించే కొందరు ముస్లిం మతపెద్దలు లేదా వారి అనుచరులు ఇటువంటి ప్రచారాన్ని వ్యాప్తి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

వాస్తవానికి, కొన్ని సంవత్సరాల క్రితం సౌదీ ప్రభుత్వం దేశాన్ని ఆర్థికంగా మరియు సామాజికంగా అభివృద్ధి చేయడానికి "విజన్ 2030" అనే ప్రణాళికను ప్రారంభించింది. ఈ ప్రణాళిక యొక్క ప్రధాన లక్ష్యం, చమురు ఆదాయాలపై ఆధార పడకుండా సౌదీ అరేబియా బలమైన ఆర్థిక వ్యవస్థను ఎలా నిర్మించుకోవచ్చో తెలుసుకోవడం. ఇందులో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం, సాంకేతిక రంగంలో పెట్టుబడులను పెంచడం, ఆధునిక నగరాలు మరియు వినోద కేంద్రాలను నిర్మించడం, మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించడం మరియు వారికి మరింత స్వేచ్ఛ కల్పించే చర్యలు తీసుకోవడం వంటి అంశాలు ఉన్నాయి. ఈ కార్యక్రమాలలో కొన్ని మతపరమైన సంస్కరణలు కూడా ఉన్నాయి. వాటిలో ఒకటి, చట్టాల రూపకల్పనలో పవిత్ర ఖుర్ఆన్‌తో పాటు ముతవాతిర్ హదీస్‌లను ఆధారంగా తీసుకోవడం, అయితే అహాద్ హదీస్ (ఒకే లేదా పరిమిత ప్రసార మార్గాల ద్వారా వచ్చిన హదీస్‌లు) మరియు ఖబర్ హదీస్‌కు తక్కువ స్థాయి ఇవ్వాలని భావించడం.

ఈ విషయంపై సౌదీ ప్రభుత్వం నిజంగా ఏమి చెప్పిందో, అలాగే సంచలనాత్మక వ్యాఖ్యల ద్వారా చవకబారు కీర్తిని సంపాదించాలనుకునే మతపెద్దలు ఏమి చెబుతున్నారో పక్కన పెడితే, పవిత్ర ఖుర్ఆన్, సున్నత్ మరియు హదీస్‌ల ద్వారా మార్గదర్శకత్వం పొందడం గురించి నేటియుగ సంస్కర్తగా భావించబడే హజ్రత్ మిర్జా గులామ్ అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు ఇచ్చిన మార్గదర్శకత్వాన్ని ఇక్కడ ప్రస్తావించదలచుకున్నాము. ముస్లిం సమాజం ఎక్కడ ఎక్కడ తడబడిందో, ఎక్కడ ఎక్కడ మార్గనిర్దేశం అవసరమైందో, అక్కడ అక్కడ వారు (అ) దేవుని అనుమతితో సరైన మార్గదర్శకత్వాన్ని అందించారని మేము వినయపూర్వకంగా తెలియజేస్తున్నాము.

హుజూర్ (అ) గారి జీవన కాలంలోనే అహ్లే ఖుర్ఆన్ అనే ఒక వర్గం ఏర్పడింది. ఆ వర్గంలోని ప్రముఖ నాయకులలో అబ్దుల్లా చక్డాల్వీ మరియు గులామ్ అహ్మద్ పర్వేజ్ ఉన్నారు. ఈ వ్యక్తులకు మరియు అహ్లే హదీస్ వర్గానికి చెందిన పండితుల మధ్య తరచూ వాదోపవాదాలు జరిగేవి. అలాంటి ఒక వాదోపవాదం 1902లో అబ్దుల్లా చక్డాల్వీ మరియు ముహమ్మద్ హుస్సైన్ బటాలవి మధ్య జరిగింది. అబ్దుల్లా సాహెబ్ అహ్లే ఖుర్ఆన్ వర్గానికి చెందినవారు కాగా, ముహమ్మద్ హుస్సైన్ బటాలవి సాహెబ్ అహ్లే హదీస్ వర్గానికి చెందినవారు. అబ్దుల్లా చక్డాల్వీ మరియు ఆయన అనుచరులు పవిత్ర ఖుర్ఆన్‌ను మాత్రమే అంగీకరించేవారు, హదీస్‌లను అంతగా ఆచరణయోగ్యమైనవి కావని భావించేవారు. మరోవైపు, మౌల్వీ ముహమ్మద్ హుస్సైన్ బటాలవి హదీస్‌లు అల్లాహ్ గ్రంథమైన ఖుర్ఆన్‌పై తీర్పు చెప్పే అధికారాన్ని కలిగి ఉన్నాయని భావించేవాడు. ఈ రెండు వర్గాలు కూడా తమ తమ వైపులా అతివాద దృక్పథాలకు వెళ్ళిపోయాయి.

ఈ వాదోపవాదానికి సంబంధించి, హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూదద్ మిర్జా గులామ్ అహ్మద్ ఖాదియాని అలైహిస్సలాం గారు "రివ్యూయు ముబాహిస బటాల్వీ వ చక్డాల్వీ" అనే శీర్షికతో ఒక సమీక్ష రచించారు. ఇది రూహానీ ఖజాయిన్ 19వ సంపుటిలో పొందు పరచబడింది. అందులో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆ రెండింటిని అనగా పవిత్ర ఖుర్ఆన్ మరియు హదీస్‌ల అత్యద్భుతమైన మార్గదర్శకాల వెలుగులో అందించిన సూచనలను ఈ క్రింద పేర్కొనడం జరుగుతుంది. కావున ఈ మార్గదర్శకత్వం ముస్లిం పండితులు మరియు వారి ప్రభుత్వాలు ఆచరించదగినట్లుగా ఉంది.

హుజూర్ (అ) ఇలా పేర్కొన్నారు:

"మీ మార్గదర్శకత్వం కోసం దేవుడు మీకు మూడు విషయాలను ప్రసాదించాడు. మొదటిది ఖుర్ఆన్. రెండవది సున్నత్. అనగా, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన కార్యాచరణ మరియు ఆచరణ ద్వారా చూపించిన పవిత్ర ఆదర్శాలు. ఉదాహరణకు, నమాజ్ ఎలా చేయాలో హుజూర్ (స) స్వయంగా చేసి చూపించారు. ఉపవాసం ఎలా ఉండాలో వారు (స) స్వయంగా ఉపవాసం ఉండి చూపించారు. దీనినే సున్నత్ అంటారు. అనగా, దేవుని వాక్యాన్ని ఆచరణ రూపంలో చూపించిన ప్రవక్త యొక్క జీవన విధానం. దీనినే సున్నత్ అని అంటారు. మూడవ మార్గదర్శక సాధనం హదీస్. అనగా ప్రవక్త (స) మరణానంతరం సేకరించబడిన వారి వాక్యాలు. హదీస్ స్థానం ఖుర్ఆన్ మరియు సున్నత్ కంటే తక్కువ, ఎందుకంటే చాలా హదీస్‌లు సంభావ్యత (జన్నీ) ఆధారంగా ఉంటాయి. అయితే, ఒక హదీస్‌కు సున్నత్ మద్దతు ఉంటే, సున్నత్ దానిని నిశ్చితమైనదిగా చేస్తుంది."

(కష్తీ నూహ్, పుటలు 33--34, నజారత్ నషర్ వ ఇషాఅత్, ఖాదియాన్, 2018)

ఈ మార్గదర్శకత్వాన్ని సూచిస్తూ, పై పేర్కొన్న ఇద్దరు పండితుల మధ్య జరిగిన వాదోపవాదంపై తన సమీక్షలో హజ్రత్ మసీహ్ మౌవూద్ మిర్జా గులామ్ అహ్మద్ (అలైహిస్సలాం) గారు మరల ఇలా పేర్కొన్నారు:

అసలు విషయం ఏమిటనగా, ఈ రెండు వర్గాలలో ఒక వర్గం అతిశయ మార్గాన్ని అనుసరించగా, మరొక వర్గం లోప మార్గాన్ని అనుసరించింది. మొదటి వర్గానికి ప్రాతినిధ్యం వహించిన మహమ్మద్ హుసైన్ సాహిబ్, ప్రవక్త గారి (సల్లల్లాహు అలైహి వసల్లం)తో సంబంధం కలిగిన మరియు విశ్వసనీయంగా సంక్రమించిన హదీస్‌లను పనికిరానివిగా లేదా అర్థరహితమైనవిగా విస్మరించకూడదని చెప్పడంలో సత్యపక్షంలో ఉన్నారు. అయితే, విషయాలకు తగిన స్థానం మరియు ప్రాముఖ్యతను కాపాడే సూత్రాన్ని మరచిపోయి, హదీస్‌ల స్థాయిని అంతగా ఉన్నత స్థితికి చేర్చారు కాబట్టి, అది పవిత్ర ఖుర్ఆన్ పట్ల అవమానానికి దారితీస్తుంది మరియు దానిని నిరాకరించాల్సిన పరిస్థితిని కలిగిస్తుంది. ఇది స్పష్టమైన పొరపాటు మరియు న్యాయమార్గం నుండి తప్పిపోవడమే.

అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా పేర్కొన్నాడు:

**ఫబిఅయ్యి హదీసిన్ బఅదల్లాహి వ ఆయాతిహీ యూమినూన్**

అనగా, అల్లాహ్ మరియు ఆయన సూక్తుల తరువాత వారు ఇంకే మాటను (హదీథ్‌ను) విశ్వసిస్తారు?" (జాసియా :6)

మరోవైపు, ఆయన ప్రత్యర్థి మౌల్వీ అబ్దుల్లా సాహిబ్ లోప మార్గాన్ని అనుసరించి, హదీస్‌లను పూర్తిగా తిరస్కరించారు. హదీస్‌లను తిరస్కరించడం ఒక విధంగా పవిత్ర ఖుర్ఆన్‌ను కూడా తిరస్కరించినట్లే. ఎందుకంటే అల్లాహ్ తఆలా ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

**" ఖుల్ ఇన్‌కున్‌తుం తుహిబ్బూనల్లాహ ఫత్తబిఊనీ యుహ్‌బిబ్‌కుముల్లాహు."**

అనగా "నీవిట్లనుము: మీరు అల్లాహ్‌ను ప్రేమిస్తే నన్ను అనుసరించండి; అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు." (ఆలే ఇమ్రాన్ :31)

అల్లాహ్ ప్రేమ, దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అనుసరించడంపై ఆధారపడి ఉంది. అలాగే, ప్రవక్తగారి ఆచరణాత్మక ఆదర్శాన్ని తెలుసు కోవడానికి హదీస్ ఒక ముఖ్యమైన సాధనం. ఆ ఆదర్శాన్ని అనుసరించడమే నిజమైన అనుసరణకు పునాది. కాబట్టి, ఎవరు హదీస్‌ను విడిచిపెడతారో వారు ప్రవక్త (స)ను అనుసరించే మార్గాన్నే విడిచిపెట్టిన వారవుతారు.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇతర హదీస్ పండితులు మరియు వారి విమర్శకుల కంటే భిన్నంగా, హదీస్‌ను పరిశీలించే ప్రమాణాన్ని వివరించారు. అదేమనగా పవిత్ర ఖుర్ఆన్ బోధనలకు అనుగుణంగా ఉన్న ఏ హదీస్ అయినా, అది బలహీనమైనదిగా పరిగణించబడినా, దానిని అంగీకరించాలి. అందుకు భిన్నముగా ఏ హదీస్ అయిన అత్యంత ప్రామాణికమైనదిగా, విస్తృతంగా సంక్రమించినదిగా పరిగణించబడినా, అది ఖుర్ఆన్ యొక్క స్పష్టమైన బోధనలకు విరుద్ధంగా కనిపిస్తే, ముందుగా ఆ విరోధాన్ని సమన్వయం చేయడానికి ప్రయత్నించాలి. అయితే ఏ విధంగానూ ఆ విరోధాన్ని తొలగించ లేకపోతే, అటువంటి హదీస్‌ను విడిచిపెట్టాలి. ఎందుకంటే అది నిజంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నుండి వచ్చినది కాదని అర్థం. మరల ఇలా తెలిపారు. అంతేకాక, ఒక భవిష్యవాణిని కలిగిన హదీస్‌ను హదీస్ పండితులు బలహీనమైనదిగా నిర్ణయించినా, తరువాత కాలంలో ఆ భవిష్యవాణి నిజమై నెరవేరితే, ఆ హదీస్‌ను కూడా సత్యమైనదిగా పరిగణించాలి. అటువంటి సందర్భంలో, దానిని బలహీనమైనది లేదా కల్పితమైనది అని పేర్కొన్న పండితులను మరియు కథకులను పొరబడిన వారిగా భావించాలి. భవిష్యవాణులు కలిగినటువంటి హదీస్‌లు వందల సంఖ్యలో ఉన్నాయి. వాటిలో అనేక హదీస్‌లను హదీస్ పండితులు లోపభూయిష్టమైనవి, కల్పితమైనవి లేదా బలహీనమైనవి అని వర్గీకరించారు. కాబట్టి, వాటిలో ఏదైనా ఒకటి నెరవేరినప్పుడు, "ఇది బలహీనమైన హదీస్ కాబట్టి మేము దీనిని అంగీకరించము" అని లేదా "దాని కథకుడు విశ్వసనీయుడు కాదు" అని చెప్పి తిరస్కరిస్తే, అది స్వయంగా దైవ సత్యాన్ని తిరస్కరించినట్లే అవుతుంది. ఎందుకంటే ఆ హదీస్ సత్యమని అల్లాహ్ స్వయంగా దాని నెరవేర్పు ద్వారా వెల్లడించాడు. (కిష్తీ నూహ్ రచన భావసారం)

కావున ఇలాంటి హదీస్‌లను పరిశీలించడానికి సంబంధించిన ఈ దృఢమైన సూత్రాలను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) నిర్దేశించారు. ఈ యుగంలో వారు (అ) అల్లాహ్ తరఫున న్యాయాధిపతిగా మరియు నిష్పక్షపాత తీర్పుదారుడిగా అవతరింపబడ్డారు. వారు (అ) ప్రవేశపెట్టిన దైవిక తీర్పులన్నింటిని అంగీకరించడం ద్వారానే ఇస్లాం యొక్క బలాన్ని మరియు నిలకడను మనం నిర్ధారించగలము. కాబట్టి, హదీస్‌లను పరిశీలించడం మరియు వాటిని ఆచరించు విషయంలో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) సూచించిన మార్గదర్శకత్వాన్ని అనుసరించడం చాలా ముఖ్యం. (సమాప్తం)

---

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

# జుమా ప్రసంగము

**"దారిలో, అబూ జహల్ ముత్ఇమ్‌ను ఈ స్థితిలో చూసినప్పుడు, అతను ఆశ్చర్యపడి ఇలా అడిగాడు: అ ముజీరున్ అమ్ తాబిఉన్ అనగా, " నీవు ముహమ్మద్ (స)కు ఆశ్రయం ఇచ్చావా, లేక ఆయన అనుచరుడిగా మారిపోయావా?' అందుకు ముత్ఇమ్ 'నేను కేవలం ఆశ్రయం ఇచ్చేవాడిని మాత్రమే, అనుచరుడిని కాదు.' అని సమాధానమిచ్చాడు.**

**అల్లాహ్ యొక్క ప్రవక్త (స) మక్కాలో పది సంవత్సరాలు ఉన్నారు. హజ్ రోజులలో వారు ఉక్కాజ్ మరియు మజన్నా జాతరలకు వెళ్లి, ప్రజలను వారి ఇళ్లలో మరియు గుడారాలలో కలుసుకుని వారిని ఆహ్వానించేవారు. వారిని ఇలా అడిగేవారు: "నాకు ఎవరు ఆశ్రయం ఇస్తారు? నా ప్రభువు సందేశాన్ని నేను అందించగలిగేలా నాకు ఎవరు సహాయం చేస్తారు, వారికి స్వర్గం లభిస్తుంది" .**

**సయ్యిద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 13 మార్చి 2026 ( 13 అమాన్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ۔

إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ۔

صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ۔

రెండు శుక్రవారాల క్రితం, నేను హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవితాన్ని మరియు తౌహీద్ (అల్లాహ్ ఏకత్వం) పట్ల వారికున్న అపారమైన ఉత్సాహాన్ని గురించి ప్రస్తావించాను.

నిజానికి, వారు ఈ లక్ష్యాన్ని స్థాపించేందుకు పంపించబడ్డారు. ఈ ఉత్సాహం వారి మాటల్లోనూ, కార్యాల్లోనూ మాత్రమే కాకుండా, వారి సహాబాలలోను మరియు వారిని అనుసరించిన వారిలోను తౌహీద్ పట్ల అసమానమైన ఆత్మస్ఫూర్తిని, తపనను నాటింది. అలాగే తౌహీద్ కొరకు ఎటువంటి త్యాగానికైనా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే భావనను వారిలో కలిగించింది.

ఈ రోజు కూడ హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవితంలోని ఇదే అంశాన్ని నేను ప్రస్తావించుతాను. అలాగే ఈ విషయానికి సంబంధించి సహాబాలు చేసిన కొన్ని త్యాగాలను కూడా ప్రస్తావిస్తాను.

దైవ ప్రవక్త (స) వారి ఆచరణాత్మక ఆదర్శం, వారి ఉత్సాహం మరియు వారి ప్రార్థనల ఫలితంగానే సహాబాలు కూడా ఈ ఉన్నత స్థాయిలను పొందారు మరియు ప్రతి త్యాగానికీ సిద్ధపడ్డారు.

తౌహీద్ స్థాపన కోసం హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఎదుర్కొన్న కష్టాలను ఒక హదీస్‌లో ఈ విధంగా పేర్కొన్నారు: ఒకసారి, విగ్రహారాధకులు హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారితో, "మా విగ్రహాల గురించి మీరు ఇలా మాట్లాడడం లేదా?" అని అడిగారు. అందుకు ప్రవక్త (స) వారు, "అవును, నేను మాట్లాడాను" అని సమాధానమిచ్చారు. అప్పుడు వారు ప్రవక్త (స) చుట్టూ గుమిగూడారు. ఆ సమయంలో ఎవరో హజ్రత్ అబూ బకర్ (ర) గారితో, "మీ స్నేహితుని పరిస్థితి చూడండి" అని చెప్పారు. హజ్రత్ అబూ బకర్ (ర) వెంటనే బయలుదేరి పవిత్ర మస్జిద్‌కు చేరుకొని, ప్రవక్త (స) వారిని ప్రజలు చుట్టుముట్టి ఉండడాన్ని చూశారు. అప్పుడు ఆయన, "అయ్యో మీకు శాపం కలుగుగాకా!" అని అన్నారు. ఆ తరువాత, పవిత్ర ఖుర్ఆన్‌లో హెచ్చరించినట్లుగా వారు కూడ ఇలా అన్నారు:

أَتَقْتُلُوْنَ رَجُلًا أَنْ يَّقُوْلَ رَبِّيَ اللّٰهُ وَقَدْ جَآءَكُمْ بِالْبَيِّنٰتِ مِنْ رَّبِّكُمْ (المؤمن:29)

అనగా "తన ప్రభువు అల్లాహ్ అని చెప్పినందుకు మాత్రమే, మరియు మీ ప్రభువు నుండి స్పష్టమైన సాక్ష్యాలను మీ వద్దకు తీసుకువచ్చిన ఒక మనిషిని మీరు హతమార్చ దలచుతున్నారా?" (మోమినూన్ :29)

ఇది విన్న వెంటనే వారు ప్రవక్త (స) వారిని వదిలి హజ్రత్ అబూ బకర్ (ర) వైపు దూసుకెళ్లి ఆయనను తీవ్రంగా కొట్టడం ప్రారంభించారు. హజ్రత్ అబూ బకర్ (ర) కుమార్తె హజ్రత్ అస్మా (ర) ఇలా వివరించారు: వారు మా వద్దకు తిరిగి వచ్చినప్పుడు, తన జుట్టును పట్టుకున్నచో అది ఊడి చేతిలోకి వచ్చేది. అంటే, వారు ఆయన జుట్టును అంత బలంగా లాగారు కాబట్టి అది వేర్లతో సహా ఊడిపోయింది. అయినప్పటికీ, హజ్రత్ అబూ బకర్ (ర) పదే పదే ఈ మాటలను పునరావృతం చేస్తూనే ఉన్నారు: తబారక్త యా జుల్ జలాల్ వల్ ఇక్రామ్ అనగా "ఓ మహిమ మరియు గౌరవానికి అధిపతీ! నీవు ధన్యుడవు."

మరో కథనంలో, వారు హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి పవిత్ర తల మరియు గడ్డాన్ని అంత బలంగా లాగారని, దాంతో అనేక వెంట్రుకలు ఊడిపోయాయని పేర్కొనబడింది. అప్పుడు హజ్రత్ అబూ బకర్ (ర) వారిని రక్షించడానికి ముందుకు వచ్చి ఇలా అన్నారు: అ తఖ్‌తులూన రజులన్ అయ్యఖూల రబ్బియల్లాహు..అనగా "తన ప్రభువు అల్లాహ్ అని చెప్పినందుకు మాత్రమే ఒక మనిషిని మీరు హతమార్చదలచుతున్నారా?" హజ్రత్ అబూ బకర్ (రజి) ఇలా చెబుతూ ఏడుస్తున్నారు. అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఓ అబూ బకర్! వారిని వదిలేయి. నా ప్రాణం ఎవరి చేతిలో ఉందో ఆ అల్లాహ్ ప్రమాణం! నేను వారికోసమే పంపబడ్డాను, ఇందుకు నేను త్యాగం చేయబడగలను." అప్పుడు వారు దైవ ప్రవక్త (స)ను వదిలేశారు.

(సీరతుల్ హలబియ్యా సంపుటి 1,పేజి 417, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్, 2002)

అంటే, వారు దైవ ప్రవక్త (స)ను హింసిస్తూ కొడుతున్నప్పుడు, హజ్రత్ అబూ బకర్ (రజి) మధ్యలో వచ్చినప్పుడు, ఆ సమయంలో దైవ ప్రవక్త (స) వారిని వదిలేయమని అన్నారు.

అదేవిధంగా, మరొక కథకుడు హారిస్ బిన్ హారిస్ ఘమిది అనే ఒక దైవ ప్రవక్త (స)పై జరిగిన అన్యాయాలను చూశాడు. అతను తన తండ్రిని అడిగాడు, "ఈ ప్రజలు ఎవరు?" ఇది ఒక్క సంఘటన మాత్రమే కాదు; ఈ స్వభావానికి చెందిన లెక్కలేనన్ని సంఘటనలు జరిగాయి. ఇవి ఇలాంటి సంఘటనలే, కానీ అనేక మంది వాటిని చూశారు మరియు పేర్కొన్నారు. అనేక మంది కథకులు ఉన్నారు. కొందరు వివరంగా చెప్పారు, మరికొందరు తక్కువ వివరాలు ఇచ్చారు. ఏదేమైనా, అతను ఇది చూసి, అన్యాయం చేస్తున్న ఈ ప్రజలు ఎవరు? అని తన తండ్రిని అడిగినప్పుడు, అతని తండ్రి ఇలా సమాధానమిచ్చాడు: "ఈ ప్రజలు తమ సాబీ చుట్టూ గుమిగూడారు." మక్కా ప్రజలు దైవ ప్రవక్త (స)ను మరియు ముస్లింలను ఎగతాళిగా "సాబీ" అని పిలిచేవారు. కథకుడు ఇలా చెబుతున్నాడు: "మేము కూడా మా వాహనం నుండి దిగినప్పుడు, దైవ ప్రవక్త (స) ప్రజలను అల్లాహ్ తఆలా యొక్క ఏకత్వం వైపు పిలుస్తున్నారని, అల్లాహ్‌ను విశ్వసించమని ఆహ్వానిస్తున్నారని, వారు ఆయనను తిరస్కరిస్తూ మధ్యాహ్నం వరకు ప్రవక్త (స)కు హాని కల్గించడాన్ని చూశాము, చివరకు ప్రజలు ప్రవక్త (స)ను వదిలి వెళ్లిపోయారు." (అల్-ముజమ్ అల్-కబీర్, సంపుటి 3, అల్-హారిస్ బిన్ అల్-హారిస్ అల్-ఘమిది, హదీస్ 3373, ఇబ్న్ తైమియ్యహ్ పబ్లిషర్స్, కైరో, పుట 304)

ప్రవక్త (స)పై జరిగిన అన్యాయాల ప్రస్తావన చరిత్రకు సంబంధించిన అనేక పుస్తకాలలో కనిపిస్తుంది. వీటిలో నుండి సేకరిస్తూ, హజ్రత్ ముస్లెహ్-ఏ-మౌవూద్ (రజి) కూడా ఇలాంటి సంఘటనలను వివరించారు. " దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్ (పవిత్ర ఖుర్ఆన్ అధ్యయనానికి పరిచయం)" అనే గ్రంథంలో వారు రజి ఒక చోట ఇలా వ్రాస్తారు:

"ఒకసారి దైవ ప్రవక్త (స) ఒక వీధి గుండా వెళ్తుండగా, మక్కాలోని కొందరు దుర్మార్గులు వారి దగ్గరకు వచ్చారు, మరియు మార్గమంతా వారు ప్రవక్త (స) మెడపై కొడుతూ, 'ప్రజలారా! తాను ప్రవక్తనని చెప్పుకునే వ్యక్తి ఇతనే' అని అంటూనే ఉన్నారు." పొరుగున ఉన్న ఇళ్ల నుండి వారి ఇంటిపై నిరంతరం రాళ్లు విసిరే వారు. వారి ఇంట్లోకి అపవిత్రమైన వస్తువులను విసిరేవారు. ఆహారం వండే ప్రదేశాల్లో కూడా మేకలు మరియు ఒంటెల పేగులు సహా అపవిత్రమైన వస్తువులను విసిరేవారు.వారు నమాజ్‌లో నిలబడినప్పుడు, వారిపై దుమ్ము విసిరేవారు (మురికి వారిపై వేయబడేది), చివరకు నమాజ్ చేయడానికి ఒక కొండ చరియ నుండి బయటకు వచ్చిన రాయి కింద దాక్కోవాల్సి వచ్చేది. (దీబాచా తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వార్-ఉల్-ఉలూమ్, సంపుటి 20, పుట 198)

కానీ దైవ ప్రవక్త (స) యొక్క పవిత్ర వ్యక్తిత్వంపై వేలాది వేల సలాములు ఉండుగాకా!, ఎందుకంటే అల్లాహ్ యొక్క ఏకత్వ స్థాపన కోసం వారి హృదయంలో ఉప్పొంగిన ఉత్సాహం ఒక్క క్షణం కూడా తగ్గలేదు, మరియు వారు ఈ సమస్త కష్టాలను సంతోషంతో కూడిన చిరునవ్వుతో (గొప్ప ఆనందంతో) స్వీకరించారు. అయినప్పటికీ, మానవజాతిపై వారి కరుణ మరియు ప్రేమలో ఏమాత్రం తగ్గుదల లేదు.

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఇలా కూడా వ్రాశారు: "దైవ ప్రవక్త (స) వారి జీవిత సంఘటనలను పరిశీలించినప్పుడు, ఈ వాదన మన ముందే

వాస్తవ రూపంలో ప్రత్యక్షమవుతున్నట్లు కనిపిస్తుంది. ప్రతి అడుగులోనూ సమస్త మానవ జాతిపట్ల వారు కలిగిన అపారమైన ప్రేమ, కరుణలకు సాక్ష్యమిచ్చే సంఘటనలను మనం చూస్తాము. ఏకైక దేవుని సందేశాన్ని ప్రజలకు చేరవేయడానికి వారు ఎన్నో సంవత్సరాలు అంతులేని కష్టాలను భరించాల్సి వచ్చింది. ఒకసారి కాబాలో అవిశ్వాసులు వారి మెడకు ఒక వస్త్రాన్ని చుట్టి అంత బిగిగా లాగారు కాబట్టి వారి కళ్ళు ఎర్రబడి బయటకు పొడుచుకొచ్చే స్థితికి చేరాయి. ఇది విన్న హజ్రత్ అబూ బకర్ (రజి) పరుగెత్తుకుంటూ వచ్చి, దైవ ప్రవక్త (స) అటువంటి బాధాకరమైన స్థితిలో ఉండటం చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆ అవిశ్వాసులను దూరం చేస్తూ, 'దేవునికి భయపడండి! "దేవుడే నా ప్రభువు" అని చెప్పినందుకే మీరు ఈ మనిషిపై అణచివేత చేస్తున్నారా?' అని అన్నారు." (తఫ్సీర్-ఎ-కబీర్, 2023, భాగం 9, పుట 316)

ఒక సందర్భంలో దైవ ప్రవక్త (స) పవిత్ర మస్జిద్‌లో నిలబడి మక్కా బహుదైవారాధకులను ఉద్దేశించి, "అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైన వేరెవ్వరూ లేరని ప్రకటించండి; అప్పుడు మీరు విజయాన్ని పొందుతారు" అని చెప్పారు. ఇది విన్న ఖురైష్ ప్రజలు దైవ ప్రవక్త (స)పై దాడి చేశారు. ఒక వ్యక్తి గట్టిగా అరుస్తూ (ఆయనపై దాడి చేయాలనే ఉద్దేశంతో) వచ్చాడు. అయితే హారిస్ బిన్ అబీ హాలహ్ ముందుగా ప్రవక్త (స) వద్దకు చేరుకున్నారు. ఆయన ఆ ప్రజలతో పోరాడి, వారిని ప్రవక్త (స) నుండి దూరం చేశారు. అనంతరం వారందరూ హారిస్‌పై విరుచుకుపడి, చివరకు ఆయనను షహీద్ చేశారు. (ఇమ్తా అల్-ఇస్మా, భాగం 6, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, 1999, పుట 297)

దేవుని ఏకత్వాన్ని ప్రకటించినందుకు శిక్షగా, మక్కా అవిశ్వాసులు దైవ ప్రవక్త (స) మరియు వారి కుటుంబాన్ని అబూ తాలిబ్ లోయలో మూడు సంవత్సరాల పాటు నిర్బంధించారు. వారు విధించిన సామాజిక బహిష్కరణ అంత కఠినంగా ఉండేది. అన్ని రకాల సామాజిక సంబంధం నిలిపివేయబడింది.

ఈ బహిష్కరణ ముగిసిన తర్వాత, ఒకవైపు దైవ ప్రవక్త (స) గతం కంటే మరింత దృఢ సంకల్పంతో, ధైర్యంతో మక్కా అంతటా దేవుని ఏకత్వ సందేశాన్ని ప్రచారం చేయడం ప్రారంభించారు. మరోవైపు ఖురైష్ ప్రజలు మళ్లీ వారిపై అన్యాయాలు చేయడం ప్రారంభించారు.

తాయిఫ్‌కు వారు చేసిన ప్రయాణం కూడా ప్రసిద్ధ సంఘటన. దీనిని గతంలో అనేకసార్లు వివరించారు. అక్కడ వారిపై జరిగిన హింసను చారిత్రక వర్ణనల్లో వివిధ విధాలుగా వివరించారు. ఈ విషయమై హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (ర.అ.) కూడా ఒకచోట ఇలా వ్రాశారు:

"అబూ తాలిబ్ లోయపై విధించిన నిషేధం తొలగించబడిన తరువాత, దైవ ప్రవక్త (స) తన కార్యకలాపాలకు కొంత స్వేచ్ఛ లభించిందని భావించి, తాయిఫ్‌కు వెళ్లి అక్కడి ప్రజలను ఇస్లాం వైపు ఆహ్వానించాలని నిర్ణయించుకున్నారు. (ఇది ఇంతకుముందు ప్రస్తావించబడింది, కానీ ఇక్కడ మరికొన్ని వివరాలు ఉన్నాయి.) తాయిఫ్ మక్కాకు ఆగ్నేయ దిశలో సుమారు నలభై మైళ్ల దూరంలో ఉన్న ప్రసిద్ధ ప్రాంతం. ఆ కాలంలో అక్కడ బను సకీఫ్ తెగ నివసించేది. కాబా ప్రత్యేకతను పక్కన పెడితే, తాయిఫ్‌ను మక్కాకు సమానమైన నగరంగా భావించేవారు. అక్కడ అనేక ప్రముఖులు, ప్రభావశీలులు, ధనవంతులు నివసించేవారు. మక్కా ప్రజలే తాయిఫ్ ప్రాముఖ్యతను అంగీకరించేవారు. అందుకే వారు (పవిత్ర ఖుర్ఆన్‌లో పేర్కొన్నట్లుగా) ఇలా అన్నారు: లౌలా నుజ్జిల హాజల్ ఖుర్ఆను అలా రజులిన్ మినల్ ఖర్యతైని అజీమ్ అనగా 'ఈ ఖుర్ఆన్ మక్కా లేదా తాయిఫ్‌లోని ఏదైనా గొప్ప వ్యక్తిపై ఎందుకు అవతరించలేదు?'. మొత్తానికి 10వ నబవీ సంవత్సరంలోని షవ్వాల్ నెలలో, దైవ ప్రవక్త (స) స్వయంగా తాయిఫ్‌కు ప్రయాణం చేశారు. ఇతర వృత్తాంతాల ఆధారంగా, జైద్ బిన్ హారిసా (ర) కూడా ప్రవక్త (స)తో పాటు వెళ్లారు. వారు అక్కడికి చేరుకున్న తర్వాత, దైవ ప్రవక్త (స) పది రోజుల పాటు అక్కడే ఉండి, ఒకరి తర్వాత మరొకరిని అనేక మంది నాయకులను కలిశారు, కానీ మక్కా వలె ఈ నగరానికి కూడా ఇస్లాంను స్వీకరించడం విధిలో లేదు. అందువల్ల, వారందరూ నిరాకరించారు; వాస్తవానికి, వారు దైవ ప్రవక్త (స)ను ఎగతాళి చేశారు. "చివరికి, దైవ ప్రవక్త (స) తాయిఫ్‌కు చెందిన 'అబ్ద్ యలీల్ అనే గొప్ప నాయకుడిని సంప్రదించి, ఇస్లాం వైపు ఆహ్వానించారు, కానీ అతను కూడా నిరాకరించాడు; అంతేకాక, ఎగతాళి చేసే విధంగా ఇలా అన్నాడు: 'మీరు నిజం చెబుతున్నట్లయితే, మీతో మాట్లాడే శక్తి నాకు లేదు, మరియు మీరు అబద్ధికుడైతే, మీతో మాట్లాడటం వ్యర్థం.' (ఇది అతను దైవ ప్రవక్త (స)కు ఇచ్చిన సమాధానం.) "తర్వాత, నగరంలోని యువకులు దైవ ప్రవక్త (స) ప్రభావానికి లోనవుతారేమోనని ఆందోళన చెంది, అతను ఇలా అన్నాడు: 'మీరు ఈ ప్రదేశాన్ని విడిచి వెళ్లడం మంచిది, ఎందుకంటే ఇక్కడ మీ మాట వినడానికి సిద్ధంగా ఉన్నవారు ఎవరూ లేరు.' "ఆ తర్వాత, ఈ దుష్టుడు నగరంలోని దుర్మార్గులను దైవ ప్రవక్త (స) వెనుక పంపించాడు. వారు నగరాన్ని విడిచినప్పుడు, ఈ గుంపు దైవ ప్రవక్త (స)ను వెంబడించి, రాళ్లతో కొట్టడం ప్రారంభించింది, దాని వలన దైవ ప్రవక్త (స) యొక్క మొత్తం శరీరం రక్తంతో తడిసి పోయింది. ఈ ప్రజలు దైవ ప్రవక్త (స)ను దాదాపు మూడు మైళ్ల దూరం వరకు వెంబడించి, పదే పదే వారిని దూషిస్తూ రాళ్లు విసిరారు.

"తాయిఫ్ నుండి మూడు మైళ్ల దూరంలో, మక్కాకు చెందిన ఉత్బా బిన్ రబీఅ అనే నాయకుడికి చెందిన ఒక తోట ఉండేది. దైవ ప్రవక్త (స) ఆ తోటలో ఆశ్రయం పొందారు, మరియు వారి క్రూరమైన శత్రువులు అలసిపోయి తిరిగి వెళ్లిపోయారు. ఒక నీడ కింద నిలబడి, దైవ ప్రవక్త (స) అల్లాహ్‌ను ఈ క్రింది మాటలతో ప్రార్థించారు: అల్లాహుమ్మ ఇలైక అష్కూ జుఉఫ ఖువ్వతి వ ఖిల్లత హీలతి వ హవాని అలన్నాసి అల్లాహుమ్మ యా అర్హమ ర్రాహిమీన అంత రబ్బుల్ ముస్తజ్అఫీన వ అంత రబ్బి. అనగా "ఓ నా ప్రభూ!, నా బలహీనతను, నా అసమర్థతను, మరియు ప్రజల ముందు నా నిస్సహాయ స్థితిని నేను నీకు ఫిర్యాదు చేస్తున్నాను. ఓ నా దేవా!, నీవు అత్యంత కరుణామయుడవు, ఎందుకంటే నీవే బలహీనులు మరియు నిస్సహాయుల సంరక్షకుడివి. నీవే నా ప్రభువు. (వారు మరల ఇలా అన్నారు, దాని అనువాదం:) నేను నీ ముఖ కాంతిలో ఆశ్రయం కోరుతున్నాను. సమస్త చీకటిని తొలగించేది నీవే, మరియు ఈ లోకంలోను పరలోకంలోను అనుగ్రహ వారసత్వాన్ని ప్రసాదించేది నీవే."

ఈ సమయంలో, 'ఉత్బా మరియు షైబా తమ తోటలో ఉన్నారు. దైవ ప్రవక్త (స)ను ఈ స్థితిలో చూసినప్పుడు, బహుశా సమీప లేదా దూర బంధుత్వ భావోద్వేగాలతో కదిలిపోయి ఉండవచ్చు, లేదా బహుశా తెగకు చెందిన బాధ్యత భావంతో, వారు తమ క్రైస్తవ బానిస అయిన అదాస్ చేతిలో ఒక ద్రాక్ష పళ్లెంను దైవ ప్రవక్త (స) వద్దకు పంపించారు. దైవ ప్రవక్త (స) వాటిని తీసుకుని అదాస్‌ను ఉద్దేశించి ఇలా అన్నారు: 'నీవు ఎక్కడి వాడివి, మరియు ఏ మతాన్ని అనుసరిస్తున్నావు?' 'నేను నైనివాకు చెందినవాడిని,' అని అదాస్ సమాధానమిచ్చాడు, 'మరియు నేను క్రైస్తవుడిని.' దైవ ప్రవక్త (స) అడిగారు, 'అదే నైనివానా, అక్కడ దేవుని నీతిమంతుడైన సేవకుడు, మత్తా కుమారుడైన యూనుస్ (అ) నివసించారు కదా?' 'అవును,' అని అదాస్ సమాధానమిచ్చాడు, 'కానీ యూనుస్ (అ) గురించి మీకు ఎలా తెలుసు?' అని అడిగాడు. అందుకు 'ఆయన నా సోదరుడు,' అని దైవ ప్రవక్త (స) అన్నారు, 'ఎందుకంటే ఆయన అల్లాహ్ యొక్క ప్రవక్త, మరియు నేనూ అల్లాహ్ యొక్క ప్రవక్తనే.' ఆ తరువాత దైవ ప్రవక్త (స) అతనికి ఇస్లాం సందేశాన్ని బోధించారు, అది అతనిని ఎంతో ప్రభావితం చేసింది. నిజాయితీతో కూడిన ఉత్సాహంలో, అతను ముందుకు వచ్చి దైవ ప్రవక్త (స) చేతులను ముద్దుపెట్టుకున్నాడు. ఉత్బా మరియు షైబా ఈ దృశ్యాన్ని దూరం నుండి గమనించారు; అందువల్ల అదాస్ వారి వద్దకు తిరిగి వచ్చినప్పుడు, వారు ఇలా అన్నారు: 'నీకు ఏమైంది, నీవు ఈ మనిషి చేతులను ముద్దుపెట్టుకోవడం ప్రారంభించావు? ఈ మనిషి నీ విశ్వాసాన్ని నాశనం చేస్తాడు, అయితే నీ మతం అతని మతం కంటే ఉత్తమమైనది.'

"దైవ ప్రవక్త (స) కొంత సమయం ఈ తోటలో విశ్రాంతి తీసుకున్నారు. ఆ తరువాత వారు అక్కడి నుండి బయలుదేరి మక్కా నుండి సుమారు ఒక రోజు ప్రయాణ దూరంలో ఉన్న నఖ్లాకు చేరుకున్నారు, అక్కడ కొన్ని రోజులు ఉన్నారు. ఆ తరువాత దైవ ప్రవక్త (స) బయలుదేరి హిరా పర్వతానికి చేరుకున్నారు, మరియు తాయిఫ్‌లో జరిగిన స్పష్టమైన వైఫల్యం కారణంగా మక్కావాసులు మరింత ధైర్యంగా మారే అవకాశం ఉండటంతో (మరియు వారు తమ క్రూరత్వాలను మరింత పెంచుతారనే ఆలోచనతో), దైవ ప్రవక్త (స) ముత్ఇమ్ బిన్ అద్దికి నేను మక్కాలో ప్రవేశించాలని కోరుకుంటున్నాను. ఈ విషయంలో మీరు నాకు సహాయం చేయగలరా?. అని సందేశం పంపించారు.

"ముత్ఇమ్ గట్టి అవిశ్వాసి అయినప్పటికీ, అతని స్వభావంలో ఔదార్యం ఉండేది, మరియు ఇలాంటి సమయాల్లో నిరాకరించడం గొప్ప అరబ్బుల స్వభావానికి విరుద్ధం. అందుకే, తన కుమారులు మరియు బంధువులతో కలిసి, పూర్తిగా ఆయుధాలతో, వారు కాబా వద్ద నిలబడి, దైవ ప్రవక్త (స) ప్రవేశించవచ్చని సందేశం పంపారు. దైవ ప్రవక్త (స) ప్రవేశించి కాబా తవాఫ్ చేశారు, మరియు ముత్ఇమ్ మరియు అతని పిల్లలతో కలిసి, ఖడ్గపు నీడలో రక్షణ పొందుతూ, దైవ ప్రవక్త (స) తన ఇంటికి చేరుకున్నారు.

"దారిలో, అబూ జహల్ ముత్ఇమ్‌ను ఈ స్థితిలో చూసినప్పుడు, అతను ఆశ్చర్యపడి ఇలా అడిగాడు: అ ముజీరున్ అమ్ తాబిఉన్ అనగా, " నీవు ముహమ్మద్ (స)కు ఆశ్రయం ఇచ్చావా, లేక ఆయన అనుచరుడిగా మారిపోయావా?' అందుకు ముత్ఇమ్ 'నేను కేవలం ఆశ్రయం ఇచ్చేవాడిని మాత్రమే, అనుచరుడిని కాదు.' అని సమాధానమిచ్చాడు, దీనిపై అబూ జహల్ ఇలా అన్నాడు, 'సరే, అయితే ఎలాంటి సమస్య లేదు.' ముత్ఇమ్ అవిశ్వాస స్థితిలో మరణించాడు." కాని ఇది అతను చేసిన ఒక మంచి కార్యం.

ఒక హదీస్‌లో ఇలా వర్ణించబడింది: ఒకసారి హజ్రత్ ఆయిషా (ర) దైవ ప్రవక్త (స)ను అడిగారు, "ఉహుద్ రోజు కంటే మీరు మరింత కష్టమైన రోజును ఎప్పుడైనా అనుభవించారా?" ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు, "ఆయిషా, మీ ప్రజల చేతుల్లో నేను చాలా తీవ్రమైన క్షణాలను ఎదుర్కొన్నాను." ఆ తరువాత వారు (స) తాయిఫ్ ప్రయాణ పరిస్థితులను వివరించి, అక్కడి నుండి తిరిగి వస్తున్నప్పుడు పర్వతాల దేవదూత తన వద్దకు వచ్చి ఇలా అన్నాడని చెప్పారు: "అల్లాహ్ నన్ను మీ వద్దకు పంపాడు, మీరు ఆజ్ఞాపిస్తే, ఈ ప్రజలపై ఇరువైపులా ఉన్న ఈ రెండు పర్వతాలను కూల్చి వారిని నాశనం చేయగలను." (అంటే, వారి కుడి మరియు

ఎడమ వైపులా ఉన్న పర్వతాలను వారిపై కూల్చి వారిని నాశనం చేస్తాను.) దైవ ప్రవక్త (స) అన్నారు, "లేదు, లేదు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ ప్రజలలో నుండే ఏకైక దేవుడిని ఆరాధించే వారిని జన్మింపజేస్తాడని నేను ఆశిస్తున్నాను."

(సీరత్ ఖాతమున్నబియ్యాన్ (స) 203-206)

ప్రజల పట్ల కరుణ విజయం సాధించింది, దానితో పాటు ఒక రోజు వారి వారసులు ఇస్లాంను స్వీకరించి, ఏకైక దేవునిపై విశ్వాసంలో తమను తాము స్థాపించుకుంటారనే సంపూర్ణ నిశ్చయత కూడా ఉంది.

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఏకేశ్వరత్వం కోసం దైవ ప్రవక్త (స) భరించిన కష్టాల సంఘటనలను వివరించారు. ఆయన ఇలా వ్రాస్తారు: వారి శత్రువులు వారిపై మోపిన బాధలన్నియు ఏకేశ్వరత్వ ప్రచారం కారణంగానే వచ్చాయి. వారిని కొట్టారు, వారిపై కుక్కలను మరియు బాలురను ఉసిగొల్పారు. ఒక సందర్భంలో, ప్రవక్త (స) తాయిఫ్‌కు వెళ్లినప్పుడు, ప్రజలు వారిని చాలా తీవ్రంగా రాళ్లతో కొట్టారు కాబట్టి తల నుండి పాదాల వరకు రక్తంతో తడిపోయారు. నేను ఇప్పుడే దీని వివరాలను ప్రస్తావించాను. వారు నొప్పితో కింద పడిపోయేవారు, మళ్లీ లేచినప్పుడు వారు మరల వారిపై రాళ్లు విసిరేవారు. అయినప్పటికీ ఆ స్థితిలో కూడా వారి నోటినుండి వచ్చిన మాటలు ఇవే: "ఓ నా ప్రభూ, ఈ ప్రజలను క్షమించు, ఎందుకంటే వారికి సత్యం తెలియదు."

ఈ పరిస్థితులన్నింటినీ దాటి కూడా, వారు(స) ఏకేశ్వరత్వ బోధనను విడిచి పెట్టలేదు మరియు వారు ఏం చేసినా, తాను దేవుని ఏకత్వాన్ని ప్రకటించడం ఆపనని చెబుతూనే ఉన్నారు.

తర్వాత, వారి మరణ సమయం సమీపించినప్పుడు, అదే ఆందోళనను తన పెదవులపై ఉంచుకుని ఈ లోకాన్ని విడిచారు, అంటే వారి మొత్తం జీవితం దేవుని ఏకత్వం గురించే ఉండేది. వారు ఇలా అన్నారు: "నా మరణం తర్వాత, షిర్క్ విగ్రహారాధన చేయకండి." హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఇలా వ్రాసారు: దైవ ప్రవక్త (స) జన్మించిన సమయంలో, తన తండ్రిని తన జననానికి ముందే మరియు తన తల్లిని తన జననం తర్వాత కొద్దికాలానికే మరణింపజేయడం ద్వారా అల్లాహ్ తఆలా తన ఏకత్వానికి నిదర్శనాన్ని చూపించాడని ప్రవక్త (స) నమ్ముతారు. మరో మాటలో చెప్పాలంటే, దైవ ప్రవక్త (స) తల్లిదండ్రుల మరణం ద్వారా అల్లాహ్ సర్వశక్తిమంతుడు తన ఏకత్వానికి ఒక సాక్ష్యాన్ని అందించాడు. తండ్రి మరియు తల్లి లేకుండా అనాథగా వారి జీవిత ప్రారంభం, అలాగే వారి మహోన్నత ముగింపు, ఇవే దేవుని ఏకత్వానికి గొప్ప నిదర్శనాలు.

(సీరతున్-నబీ (స), భాగం 3, పుట 188)

దీనివల్ల స్పష్టమవుతుంది ఏమిటంటే, అల్లాహ్ ఏకత్వాన్ని బోధింపజేసిన అదే దేవుడు, బాల్యం నుండి చివరి వరకు ప్రవక్త(స)ను పోషించినాడు.

అరబ్‌లోని వీధులలో కూడ వారు (స) చేసిన బోధన గురించి ప్రస్తావన ఉంది. దేవుని ఏకత్వ స్థాపన కోసం దైవ ప్రవక్త (స) మక్కాలో వ్యక్తిగతంగా మరియు సామూహికంగా బోధనలు నిర్వహించారని, అంతేకాకుండా అరబ్‌లోని కొన్ని వీధులకు వెళ్లి అక్కడ భాగస్వామి లేని ఏకైక దేవుని సందేశాన్ని అందించేవారని వ్రాయబడింది.

మక్కా బయట, వ్యాపారం మరియు సమావేశాల కోసం ప్రజలు ఏకమయ్యే అనేక ప్రదేశాలు ఉండేవి. వీటిని అస్వాక్ అల్-అరబ్ అరేబియా వీధులు అని పిలిచేవారు. అరబ్ వీధులను భారతదేశ-పాకిస్తానీ భాషలలో సాధారణంగా మనం జాతరలు అని పిలుచుకుంటాము. ఉక్కాజ్, మజన్నా మరియు జుల్ మజాజ్ ఖురైష్ మరియు అరబ్బుల విధులలో కొన్ని. వీటిలో అతిపెద్దది ఉక్కాజ్ మార్కెట్, ఇది మక్కా నుండి మూడు రాత్రుల ప్రయాణ దూరంలో ఉండేది. అరబ్బులు షవ్వాల్ నెల మొత్తం ఉక్కాజ్‌లో ఉండేవారు. ఆ తర్వాత వారు మక్కా నుండి కొన్ని మైళ్ల దూరంలో ఉన్న మర్ అల్-జహ్రాన్‌లోని మజన్నా మార్కెట్‌కు వెళ్లి, జుల్ ఖఅదా నెల ఇరవయ్యవ తేదీ వరకు అక్కడ ఉండేవారు. అనంతరం వారు అరఫాత్ మైదానం నుండి మూడు మైళ్ల దూరంలో ఉన్న ధుల్ మజాజ్ మార్కెట్‌కు వెళ్లి, హజ్ రోజుల వరకు అక్కడ ఉండేవారు. ఈ అన్ని ప్రదేశాలకు దైవ ప్రవక్త (స) వెళ్లి బోధనలు చేసేవారు.

హజ్రత్ జాబిర్ (రజి) ఇలా ఉల్లేఖించారు. అల్లాహ్ యొక్క ప్రవక్త (స) మక్కాలో పది సంవత్సరాలు ఉన్నారు. హజ్ రోజులలో వారు ఉక్కాజ్ మరియు మజన్నా జాతరలకు వెళ్లి, ప్రజలను వారి ఇళ్లలో మరియు గుడారాలలో కలుసుకుని వారిని ఆహ్వానించేవారు. వారిని ఇలా అడిగేవారు: "నాకు ఎవరు ఆశ్రయం ఇస్తారు? నా ప్రభువు సందేశాన్ని నేను అందించగలిగేలా నాకు ఎవరు సహాయం చేస్తారు, వారికి స్వర్గం లభిస్తుంది"

(ఇబ్న్ కసీర్, సీరతున్నబవియ్యాహ్, భాగం 2, దారుల్-మఅరిఫహ్, బీరూట్, 1976, పుట 194) (ఇమ్తా అల్-ఇస్మా, భాగం 8, దారుల్ కుతుబ్ అల్-ఇల్మియ్యాహ్, బీరూట్, పుట 309)( ఫర్హంగ్-ఎ-సీరత్, పుటలు 205 మరియు 259)

హజ్రత్ రబీఅ బిన్ ఇబాద్ ఇలా వివరించారు: ఆయన అజ్ఞాన యుగంలో జీవించి, తరువాత ఇస్లాంను స్వీకరించారు. ఆయన తన స్వంత కన్నులతో జుల్ మజాజ్ మార్కెట్‌లో అల్లాహ్ యొక్క ప్రవక్త (స)ను చూశారు. వారు ప్రజలతో ఇలా చెబుతున్నారు: "ఓ ప్రజలారా!, 'అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు' అని చెప్పండి, మీరు విజయవంతులు అవుతారు." వారు మార్కెట్ వీధుల గుండా నడుస్తూ ఉండగా ప్రజలు వారికి వ్యతిరేకంగా అరుస్తున్నారు. అయినప్పటికీ, వారి మాటలను స్వీకరించమని ఇతరులకు చెప్పే ఎవరినీ ఆయన చూడలేదు. అయినా ప్రవక్త (స) మౌనం వహించలేదు మరియు ఇలా చెబుతూనే ఉన్నారు: "ఓ ప్రజలారా!, 'అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు' అని చెప్పండి, మీరు అభివృద్ధి చెందుతారు." (ముస్నద్ అహ్మద్ బిన్ హన్బల్, సంపుటి 5, ముస్నద్ రబీఅహ్ బిన్ ఇబాద్, హదీస్ 16119, ఆలమ్ అల్ కోతుబ్, బీరూట్, 1998, పుట 499)

దేవుని ఏకత్వం అనే ఈ సందేశాన్ని అందించినందుకు, ప్రవక్త (స) తన స్వంత ప్రజల నుండి మరియు ఇతరుల నుండి కూడా కష్టాలను ఎదుర్కొన్నారు. వారు అడ్డుకుంటారేమో లేదా దాడి చేస్తారేమో అనే భయంతో వారు బహిరంగంగా ఆరాధన కూడా చేయలేకపోయారు. ఇస్లాంను స్వీకరించిన వారిని కూడా హింసించారు. నమాజు మరియు ఆరాధన చేయడం గురించి ఇలా వర్ణించబడింది: దైవ ప్రవక్త (స) మరియు హజ్రత్ అలీ (ర) మక్కా పర్వతాలలోని ఒక లోయకు వెళ్లి ప్రజలకు తెలియకుండా నమాజు చేసేవారు, మరియు కొంతకాలం వారు ఈ విధంగానే కొనసాగారు. తరువాత అబూ తాలిబ్‌కు ఈ విషయం తెలిసి, వారు నమాజు చేయడంను చూశారు. ఆయన అల్లాహ్ యొక్క ప్రవక్త (స)ను అడిగారు: "ఓ నా సోదరుడి కుమారుడా!, నీవు స్వీకరించిన ఈ మతం ఏమిటి?" అందుకు ప్రవక్త (స)ఇలా సమాధానమిచ్చారు: "ఓ పిన్నాన్నా!, ఇది దేవుని, ఆయన దూతల, ఆయన ప్రవక్తల మరియు మన తండ్రి ఇబ్రాహీం (అ) యొక్క మతం. దేవుడు ఈ మతంతో తన ప్రజల వద్దకు నన్ను ఒక దూతగా పంపాడు. ఓ పిన్నాన్నా!, నేను మీకు ఇచే సలహా ఏమిటనగా, ఈ మార్గదర్శకత్వం వైపు పిలవడానికి, మీరు దానిని స్వీకరించి నాకు సహాయం చేయడానికి అందరికంటే మీరు ఎక్కువ అర్హులు."

హజ్రత్ అబూ తాలిబ్ ఇలా అన్నారు: "ఓ నా సోదరుడి కుమారుడా!, నేను నా పూర్వీకుల మతాన్ని విడిచిపెట్టలేను, కానీ నేను జీవించి ఉన్నంతకాలం శత్రువుల నుండి ఎటువంటి హాని నీకు చేరదు. నేను నీకు మద్దతు ఇస్తాను." హజ్రత్ అబూ తాలిబ్ తన కుమారుడు హజ్రత్ అలీ (ర)ను కూడా అడిగారు: "నీవు స్వీకరించిన ఈ మతం ఏమిటి?" హజ్రత్ అలీ (ర) సమాధానమిచ్చారు: "నేను దేవునిని మరియు ఆయన ప్రవక్తను విశ్వసిస్తున్నాను, వారు తీసుకువచ్చిన దానిని ధృవీకరిస్తున్నాను, మరియు వారితో కలిసి దేవునికి ప్రార్థిస్తున్నాను." అప్పుడు అబూ తాలిబ్ ఇలా అన్నారు: "నిశ్చయంగా, వారు ఎల్లప్పుడూ నిన్ను మంచితనం వైపు పిలుస్తారు, కాబట్టి వారితోనే ఉండు." ఈ విధంగా, ఆయన తన కుమారుడికి దైవ ప్రవక్త (స)తో ఉండమని సలహా ఇచ్చారు. (తారీఖ్ అల్-తబరీ, సంపుటి 1, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, 1987, పుట 539)

నేను ఇంతకుముందు చెప్పినట్లుగా, సహచరులు కూడా దేవుని ఏకత్వాన్ని స్వీకరించినందుకు తీవ్రమైన హింసను అనుభవించారు. ఒకవైపు, మక్కా ఖురైషులు తమ శక్తి మరియు నాయకత్వాన్ని ఉపయోగించి దౌత్యపరమైన ఒత్తిడి తెచ్చి, బెదిరింపులు జారీ చేస్తూ, దైవ ప్రవక్త (స) ఇస్లాంను ప్రచారం చేయకుండా ఆపడానికి సాధ్యమైన అన్ని విధాలుగా ప్రయత్నించారు. మరోవైపు, ఇస్లాంను స్వీకరించిన వారిపై వారు చూపిన క్రూరత్వం మరియు దారుణమైన హింస ఎంతటి స్థాయిలో ఉండంటే, దాని పూర్తి వివరాలను నమోదు చేయడానికి పెన్నుకు కూడా శక్తి లేదు, దానిని వివరించడానికి ఎవరికైనా సులభంగా ధైర్యం కూడదు. నమోదు చేయబడిన సంఘటనలే ఒక వ్యక్తి హృదయాన్ని కదిలించడానికి సరిపోతాయి.

హజ్రత్ బిలాల్ (ర) దైవ ప్రవక్త (స)ను స్వీకరించినప్పుడు, ఆయనపై అన్ని రకాల హింసలు ప్రయోగించబడ్డాయి. ప్రజలు ఆయనపై తమ హింసను మరింత తీవ్రం చేసిన ప్రతిసారీ, హజ్రత్ బిలాల్ రజి ఇలా ప్రకటించేవారు: "అహద్, అహద్" "దేవుడు ఒక్కడే, దేవుడు ఒక్కడే." వారు ఆయనతో ఇలా చెప్పేవారు: "మేము చెప్పినట్లే నీవు కూడా చెప్పు." హజ్రత్ బిలాల్ సమాధానమిచ్చేవారు: "మీరు చెప్పుతున్నదాన్ని నా నాలుక సరిగ్గా పలకలేదు." మరో వర్ణనలో ఇలా ఉంది: హజ్రత్ బిలాల్ (ర)ను హింసించినప్పుడు, విగ్రహారాధకులు ఆయనను ఇస్లాం నుండి దూరం చేయడానికి ప్రయత్నించినప్పుడు, ఆయన కేవలం "అల్లాహ్, అల్లాహ్" అని మాత్రమే చెప్పేవారు.

---

**లజ్నా ఇమాఉల్లాహ్ వార్షిక సమావేశాలు ఖాదియాన్**

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు లజనా ఇమాఉల్లాహ్, నాసిరాతుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

మరో కథనం ప్రకారం, హ్రజత్ బిలాల్ (ర) ఇస్లాంను స్వీకరించినప్పుడు, ఆయన యజమానులు ఆయనను పట్టుకుని నేలపై పడుకోబెట్టి, ఆయనపై రాళ్లు మరియు ఒక ఆవు చర్మాన్ని ఉంచారు. వారు ఇలా అన్నారు: "నీ ప్రభువు లాత్ మరియు ఉజ్జా." అయినప్పటికీ వారు రజి "అహద్, అహద్" అని పునరావృతం చేస్తూనే ఉన్నారు.

ఆ సమయంలో హ్రజత్ అబూ బకర్ (ర) బిలాల్ (ర) యజమానుల వద్దకు వెళ్లి ఇలా అన్నారు: "మీరు ఈ మనిషిని ఇంకా ఎంతకాలం హింసిస్తారు?" హ్రజత్ అబూ బకర్ (ర) హ్రజత్ బిలాల్ (ర)ను ఏడు ఔఖియాలకు కొనుగోలు చేసి విముక్తి చేశారు. ఒక ఔఖియా నలభై దిర్హములకు సమానం. అందువల్ల ఆయనను 280 దిర్హములకు కొనుగోలు చేసి విముక్తి చేశారు.

(ఇబ్న్ సాద్, అల్-తబఖాత్ అల్-కుబ్రా, సంపుటి 3, బిలాల్ బిన్ రబాహ్, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, 1990, పుటలు 175-176)( ఉసదుల్-ఘాబా, సంపుటి 1, బిలాల్ బిన్ రబాహ్, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, పుట 416)( షరఅల్-జర్ఖానీ, సంపుటి 11, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, పుట 197)

ఆయనతో పాటు, హ్రజత్ సుమయ్యా (ర), హ్రజత్ అమ్మార్ బిన్ యాసిర్ (ర), హ్రజత్ ఖబాబ్ (ర), మరియు అనేక ఇతర బానిసలు, స్వతంత్ర పురుషులు మరియు స్త్రీలు దేవుని ఏకత్వంపై విశ్వాసం ఉంచిన కారణంగా మక్కా అవిశ్వాసుల సిగ్గుచేటైన మరియు బాధాకరమైన హింసలకు బలయ్యారు.

మక్కా అవిశ్వాసులు బలహీనమైన ముస్లింలను మాత్రమే అణచివేయలేదు, ఇంతకు ముందే ప్రస్తావించినట్లుగా దైవ ప్రవక్త (స) కూడ స్వయంగా వారి క్రూరత్వం నుండి తప్పించుకోలేదు. నిజానికి, ఎవరైనా జాగ్రత్తగా ఆలోచిస్తే, దైవ ప్రవక్త (స) స్వయంగా అత్యధిక బాధలు, దుఃఖం మరియు వేదనను భరించారని స్పష్టమవుతుంది.

ముహమ్మద్ (స) అనే పేరు దాని అర్థం "అత్యంత ప్రశంసించబడినవాడు" ఉద్దేశపూర్వకంగా వక్రీకరించబడి, ప్రజలు వారిని ముజమ్మమ్ అని పిలిచారు, దాని అర్థం "అత్యంత నిందించబడినవాడు." నవూజుబిల్లాహ్. ఆ మొత్తం పట్టణంలో అత్యంత సత్యవంతుడైన మనిషిని అబద్ధికుడిగా మరియు మోసగాడిగా పిలిచారు. ఆ జాతికి అత్యంత శ్రేయోభిలాషిని మోసపూరితుడు, అత్యాశపరుడు మరియు కపటుడిగా వర్ణించారు. తన యౌవనం, తన ఆరోగ్యం మరియు శక్తి, నిజానికి తన పగలు మరియు రాత్రి ప్రతి క్షణాన్ని అదే ప్రజల మార్గదర్శనం, సంస్కరణ మరియు సంక్షేమం కోసం అంకితం చేసిన వ్యక్తిని పిచ్చివాడు, ఉన్మాది మరియు రోగిగా ముద్ర వేశారు. కొన్ని సందర్భాల్లో, వారి మెడ చుట్టూ ఒక వస్త్రాన్ని చుట్టి, వారి శ్వాస ఆగిపోతుందేమో అనిపించేంత బలంగా లాగేవారు. మరికొన్ని సందర్భాల్లో, వారిపై రాళ్లు విసిరేవారు, కొన్నిసార్లు మలిన పదార్థాలను వారిపై వేసేవారు.

ఉర్వా బిన్ జుబైర్ (ర) ఇలా వివరించారు, "విగ్రహారాధకులు దైవ ప్రవక్త (స) పట్ల చేసిన అత్యంత దారుణమైన ప్రవర్తనను వివరించమని నేను హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ అమర్ బిన్ ఆస్ (ర) ను అడిగాను. ఆయన ఇలా సమాధానమిచ్చారు: ఒకసారి దైవ ప్రవక్త (స) హాతిమ్ సమీపంలోని పవిత్ర మస్జిద్‌లో కాబా పక్కన ఉన్న, తక్కువ ఎత్తైన గోడతో చుట్టబడిన ఖాళీ ప్రదేశంలో నమాజ్ చేస్తున్నప్పుడు, ఉక్బా బిన్ అబీ ముఐత్ వచ్చి వారి మెడ చుట్టూ ఒక వస్త్రాన్ని చుట్టి, బలంగా గొంతు నులిమడం ప్రారంభించాడు. అప్పుడు హ్రజత్ అబూ బకర్ (ర) అక్కడికి వచ్చారు. ఆయన ఉక్బా భుజాన్ని పట్టుకుని, అతన్ని దైవ ప్రవక్త (స) నుండి దూరంగా తోసి, ఇలా అన్నారు: అ తఖ్‌తులూన రజులన్ అన్ య ఖూల రబ్బియల్లాహు అనగా "'తన ప్రభువు అల్లాహ్ అని చెప్పినందుకు మీరు ఒక మనిషిని చంపుతారా?' (సహీహ్ అల్-బుఖారీ (అనువాదం) సంపుటి 7, కితాబ్ మనాఖిబి ల్-అన్సార్, బాబ్ మా లఖియా న్-నబియ్య (స) వ అస్హాబిహీ మిన్ అల్-ముష్రికీనా బి మక్కహ్, హదీస్ 3856, నజారత్ ఇషాఅత్, పుట 332)

ఇది తరచుగా ప్రస్తావించబడినట్లుగా మనం కూడా చూస్తాము. యుద్ధాల సమయంలో కూడా దైవ ప్రవక్త (స) ఎల్లప్పుడూ దేవుని ఏకత్వం పట్ల ఉత్సాహాన్ని ప్రదర్శించారు.

ఉహుద్ యుద్ధంలోని ప్రసిద్ధ సంఘటన తరచుగా వివరించబడుతుంది. అబూ సుఫ్యాన్ దైవ ప్రవక్త (స), హ్రజత్ అబూ బకర్ (ర) మరియు హ్రజత్ ఉమర్ (ర) పేర్లను ప్రస్తావిస్తూ, "ఈ వ్యక్తులు ఎక్కడ ఉన్నారు?" అని పిలిచినప్పుడు, దైవ ప్రవక్త (స) ఎవ్వరూ సమాధానం ఇవ్వవద్దని అందరికీ ఆదేశించారు. ఆ సమయంలో సమాధానం ఇవ్వడం, వారి బలహీన స్థితి కారణంగా ముస్లింలను ప్రమాదంలో పడేసే అవకాశం ఉండేది, అందుకే వారిని మౌనం పాటించమని ఆదేశించారు. తర్వాత అబూ సుఫ్యాన్, "హుబల్‌కు మహిమ కలుగుగాక!" అని ప్రకటించాడు. అతను ఇలా చెప్పినప్పుడు, దైవ ప్రవక్త (స) ఆందోళన చెందుతూ, "అతనికి సమాధానం ఇవ్వండి" అని అన్నారు. సహచరులు అడిగారు, "మేము ఏమి చెప్పాలి?" వారు ఇలా అన్నారు, అల్లాహు అఅలా వ అజల్ల, అల్లాహు అఅలా వ అజల్ల అనగా "అల్లాహ్ అత్యున్నతుడు మరియు అత్యంత మహానుభావుడు అని చెప్పండి."

అబూ సుఫ్యాన్ తరువాత, "మాకు ఉజ్జా ఉంది, మీకు ఉజ్జా లేదు" అని అన్నాడు. దైవ ప్రవక్త (స), "అతనికి సమాధానం ఇవ్వండి" అని అన్నారు. వారు అడిగారు, "మేము ఏమి చెప్పాలి?" వారు ఇలా సమాధానమిచ్చారు, "అల్లాహ్ మా సహాయకుడు, మీకు ఎలాంటి సహాయకుడు లేడు అని చెప్పండి." ఈ విధంగా, అల్లాహ్ గౌరవం మరియు దైవిక ఏకత్వ సూత్రం గురించి విషయం వచ్చినప్పుడు, పవిత్ర ప్రవక్త (స) ఎలాంటి ప్రమాదాన్నీ పట్టించుకోలేదు.

అందువల్ల, ఆ సమయంలో దేవుని ఏకత్వం పట్ల ఉన్న ఈ ఉత్సాహం కారణంగానే ఆయన సహచరులకు ఇలా ప్రకటించమని ఆదేశించారు: "అల్లాహ్ అత్యున్నతుడు మరియు అత్యంత మహోన్నతుడు. అల్లాహ్ అత్యున్నతుడు మరియు అత్యంత మహోన్నతుడు." నీవు అబద్ధం చెబుతున్నావు -- హుబల్ మహోన్నతుడు కాదు. భాగస్వామి లేని అల్లాహ్ ఒక్కడే గౌరవనీయుడు మరియు సర్వోన్నతుడు.

**(సహీ బుఖారీ, కితాబ్ అల్-మఘాజీ, బాబ్ ఘజ్వతి ఉహుద్, హదీస్ 4043)**

ఇప్పుడు నేను హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఒక ఉపదేశాన్ని చదువుతాను, దీనిని మనం శ్రద్ధగా వినాలి మరియు పదేపదే చదవాలి. ఇది దేవుని ఏకత్వాన్ని స్థాపించడంలో దైవ ప్రవక్త (స) యొక్క స్థానం మరియు హోదాను మనకు తెలియజేస్తుంది మరియు ఈ విషయంపై నిజమైన అవగాహన మరియు అనుభూతిని ఎలా పొందాలో మనకు మార్గదర్శకత్వం అందిస్తుంది. వారు (అ) ఇలా పేర్కొన్నారు:

"ఈ అరేబియా ప్రవక్త ఎంత గొప్ప ప్రవక్తో అని నేను ఎల్లప్పుడూ ఆశ్చర్యపోతుంటాను, ఆయన పేరు ముహమ్మద్ (వేలాది వేల ఆశీర్వాదాలు మరియు శాంతి ఆయనపై కలుగుగాక!). ఆయన ఉన్నత స్థానం యొక్క పరిమితిని గానీ, ఆయన ఆధ్యాత్మిక ప్రభావశీలతను గానీ ఎవరూ పూర్తిగా గ్రహించలేరు. ఆయన స్థానం ఎలా గుర్తించబడవలసిందో అలా గుర్తించబడకపోవడం విచారకరం. ప్రపంచం నుండి అదృశ్యమైన తౌహీద్‌ను తిరిగి ప్రపంచానికి అందించిన మహానుభావుడు ఆయనే. ఆయన దేవుణ్ణి అత్యంత అధికముగా ప్రేమించారు, మరియు మానవజాతి పట్ల సానుభూతితో ఆయన ఆత్మ అత్యంత తీవ్రముగా కరిగిపోయింది. అందువల్ల, ఆయన హృదయ రహస్యాన్ని తెలిసిన దేవుడు, ఆయనను ప్రవక్తలందరి కంటే, మొదటి వారికంటే మరియు చివరి వారికంటే ఉన్నతంగా చేశాడు మరియు వారి జీవితకాలంలో వారు కోరుకున్న ప్రతిదాన్ని వారికి ప్రసాదించాడు."

ఇదే వారి స్వభావంలోని అందం. ఆయన అల్లాహ్ సర్వోన్నతుడి పట్ల ప్రేమలో అత్యున్నత శిఖరాలను మరియు మానవజాతి పట్ల కరుణలో అత్యున్నత శిఖరాలను చేరుకున్నారు, తద్వారా వారు అల్లాహ్‌కు సమీపించగలరు, దేవుని ఏకత్వంపై స్థిరంగా ఉండగలరు, మరియు తమ ఇహలోక జీవితాన్ని మరియు పరలోక జీవితాన్ని రెండింటినీ సురక్షితం చేసుకోగలరు.

మరల ఇలా పేర్కొన్నారు:

"ప్రతి అనుగ్రహానికి మూలాధారం ఆయనే, మరియు ఆయన అనుగ్రహాన్ని అంగీకరించకుండా ఎవరైనా ఏదైనా శ్రేష్ఠతను ప్రకటిస్తే, అతడు మానవుడు కాదు, షైతాన్ సంతానం, ఎందుకంటే ఆయనకు (దైవ ప్రవక్త (స)) ప్రతి ఉన్నతికి తాళంచెవి ప్రసాదించబడింది మరియు ప్రతి అవగాహన యొక్క ఖజానా ఆయనకు ఇవ్వబడింది. ఆయన ద్వారా పొందని వాడు ఎప్పటికీ వంచితుడే. నేను ఏమీ కాదు మరియు

**131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్**

సయ్యద్నా హ్రజత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

**( నజారత్ ఇస్లాహ్ ఇర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్ )**

**ఉపశాఖల వార్షిక సమావేశాలు ఖాదియాన్**

సయ్యద్నా హ్రజత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు మజ్లిస్ అన్సారుల్లాహ్, ఖుద్దాముల్ అహ్మదియ్య, అత్ఫాలుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

నాకు ఏమీ లేదు. నేను ఏమిటి, నా విలువ ఏమిటి? ఈ ప్రవక్త ద్వారానే నేను నిజమైన తౌహీద్‌ను పొందానని ఒప్పుకోకపోతే నేను కృతఘ్నుడనై ఉండేవాడిని. ఈ పరిపూర్ణ ప్రవక్త ద్వారా మరియు ఆయన వెలుగు ద్వారా నేను సజీవుడైన దేవుని గుర్తింపును పొందాను. దేవునితో సంభాషణ మరియు సాన్నిహిత్యం యొక్క గౌరవం, దాని ద్వారా నేను ఆయన ముఖకాంతిని దర్శిస్తాను, అదే మహానుభావుడైన ప్రవక్త ద్వారా నాకు ప్రసాదించబడింది. ఈ మార్గదర్శక సూర్యుని కిరణాలు సూర్యకాంతిలా నాపై పడుతున్నాయి, మరియు నేను దాని వైపు ముఖం చేసి ఉన్నంత కాలం ప్రకాశింపబడుతూనే ఉంటాను."

అందువల్ల, సర్వశక్తిమంతుడైన దేవుని చేరుకోవాలంటే, సంపూర్ణ తౌహీద్‌ను స్వీకరించాలి, మరియు దైవ ప్రవక్త (స) ద్వారానే దీనిని సాధించగల మార్గం లభిస్తుంది.

హుజూర్ (అ) మరల ఇలా పేర్కొన్నారు:

"దైవ ప్రవక్త, అల్లాహ్ యొక్క శాంతి మరియు ఆశీర్వాదాలు ఆయనపై ఉండు గాక, వారిని విశ్వసించని వాడు లేదా మతభ్రష్టుడైనప్పటికీ తౌహీద్‌పై స్థిరంగా ఉండి, దేవుడు ఎటువంటి భాగస్వామి లేని ఏకైకుడని భావించే వాడు రక్షణ పొందుతాడని మరియు తన అవిశ్వాసం లేదా మతభ్రష్టత్వం కారణంగా ఎటువంటి నష్టాన్ని అనుభవించడని భావించే వారు ... నిజానికి తౌహీద్ యొక్క నిజమైన అర్థం గురించి అజ్ఞానులు .... కానీ ఆయన ఒక్కడే అని నమ్మడం మాత్రమే రక్షణకు సరిపోదు. బదులుగా, రక్షణ రెండు విషయాలపై ఆధారపడి ఉంటుంది:

"1. మొదటిది, సర్వశక్తిమంతుడైన దేవుని సత్తా మరియు ఏకత్వంపై సంపూర్ణ నిశ్చయం.

"2. రెండవది, మహిమాన్వితుడైన ఏకైక దేవుని పట్ల అలాంటి పరిపూర్ణ ప్రేమ మన హృదయంలో నాటబడాలి, దాని ప్రభావం మరియు ఆధిపత్యం ఫలితంగా, సర్వశక్తిమంతుడైన దేవునికి విధేయత నిజంగా మన హృదయానికి ఆనందంగా మారాలి, అది లేకుండా మనం అసలు జీవించలేనంతగా. (ఆ ఆధిపత్య స్థాయి ఇదే కావాలి.) అది దైవిక ప్రేమ అయి ఉండాలి, అది ఆయన తప్ప మరెవరి పట్ల ఉన్న ప్రేమనైనా తొక్కి నశింపజేయాలి.

"ఇదే నిజమైన తౌహీద్, ఇది మన యజమాని మరియు నాయకుడు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని అనుసరించడం తప్ప మరే విధంగానూ సాధించబడదు. ఎందుకు సాధించబడదు? సమాధానం ఏమిటంటే, దేవుని సత్తా అదృశ్యానికి అతీతమైన అదృశ్యం, గోప్యతకు అతీతమైన గోప్యత, మరియు అత్యంత రహస్యమైనది. మానవుల తార్కిక శక్తులు తమంతట తాముగా ఆయనను కనుగొనలేవు. ఏ తార్కిక వాదన కూడా ఆయన ఉనికికి తిరుగులేని సాక్ష్యంగా నిలవలేదు, ఎందుకంటే తర్కం యొక్క పరిధి మరియు చేరువ విశ్వంలోని సృష్టించబడిన వస్తువులను పరిశీలించడం ద్వారా ఒక సృష్టికర్త అవసరాన్ని గ్రహించే స్థాయికి మాత్రమే పరిమితం అవుతుంది. అయితే, ఆయన ఉనికి అవసరాన్ని అంగీకరించడం ఒక విషయం, కానీ ఆ అవసరాన్ని అంగీకరించిన దేవుడు నిజంగానే ఉన్నాడని 'ఐనుల్-యఖీన్ (చూచి పొందిన నిశ్చయం)' స్థాయికి చేరుకోవడం పూర్తిగా వేరే విషయం."

ఇంతటి సృష్టికి ఒక సృష్టికర్త ఉండాలి అని మాత్రమే చెప్పడం సరిపోదు. ఒకరు ఉన్నట్లయితే, ఆయన ఎవరు? ఆయన సజీవుడైన దేవుడా? దీనిని తెలుసుకోవాలని ఎవరైనా కోరుకుంటే, దైవ ప్రవక్త (స)ను అనుసరించడం ద్వారానే ఈ జ్ఞానాన్ని పొందగలరు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరల ఇలా తెలిపారు:

"అయితే, తర్కం యొక్క పద్ధతి అసంపూర్ణమైనది, లోపభూయిష్టమైనది మరియు సందేహాస్పదమైనది కాబట్టి, ప్రతి తత్వవేత్త కేవలం తర్కం ద్వారానే దేవుణ్ణి గుర్తించలేడు. బదులుగా, దేవుణ్ణి కేవలం తర్కం ద్వారా కనుగొనాలని ప్రయత్నించే చాలా మంది చివరికి నాస్తికులుగా మారుతారు. భూమి మరియు ఆకాశాలలోని సృష్టించబడిన వస్తువులపై వారి ఆలోచనలు వారికి ఏమాత్రం ప్రయోజనం చేకూర్చవు." ఈ రోజుల్లో కూడా మనం దీనిని చూస్తున్నాము: ముస్లింలలోని అనేక మంది మేధావులు నాస్తికులుగా మారుతున్నారు. వారు దేవుని ఉనికిని తిరస్కరిస్తున్నారు, ఎందుకంటే వారికి ఇవన్నీ అర్థం కావడం లేదు. దైవ ప్రవక్త (స)ను అనుసరించినప్పటికీ, వారు దైవ ప్రవక్త (స) యొక్క ఆదేశాలపై ఆలోచన చేయడంలో విఫలమయ్యారు.

మరల ఇలా తెలిపారు:

"వారు దేవుని ఎన్నుకోబడిన వారిని ఎగతాళి చేస్తారు మరియు పరిహసిస్తారు, ఇలా వాదిస్తూ: ప్రపంచమంతటా వేలాది విషయాలు ఉన్నాయి, వాటి ఉనికి మనకు ఉపయోగకరంగా కనిపించదు, మరియు వాటిపై మన పరిశోధన సృష్టికర్త ఉనికిని నిరూపించే ఎటువంటి సృజనాత్మకతను సూచించదు; దీనికి విరుద్ధంగా, ఈ విషయాల ఉనికి పూర్తిగా నిరర్థకమైనది మరియు పనికిరానిది. ఈ ప్రజలు అజ్ఞానంలో ఉన్నారని విచారించాల్సిన విషయం."

వారు చేసే వాదన ఏమిటంటే సృష్టికర్త ఎవరూ లేరని, మరియు ప్రతి విషయానికి అవసరం ఉందని వారు చూడలేరని. వాస్తవానికి, దానిలో ప్రయోజనం ఉందో లేదో వారికి తెలియదు, కానీ దాని గురించి వారికి జ్ఞానం లేనందున వారు ఇలాంటి మాటలు చెబుతున్నారు.

హుజూర్ (అ) మరల ఇలా తెలిపారు:

"ఇలాంటి అజ్ఞానులు ఏదైనా విషయం గురించి జ్ఞానం లేకపోవడం దాని ఉనికి లేకపోవడాన్ని సూచించదని అర్థం చేసుకోకపోవడం విచారకరం. (ఒక వ్యక్తికి ఏదైనా విషయం గురించి జ్ఞానం లేకపోతే, అది ఉనికిలో లేదని అర్థం కాదు.) ఈ రోజుల్లో ప్రపంచంలో తమను తాము గొప్ప మేధావులు మరియు తత్వవేత్తలుగా భావించుకునేవారు, అయినప్పటికీ సర్వశక్తిమంతుడైన దేవుని ఉనికిని తీవ్రంగా తిరస్కరించే ఇలాంటి వారు లక్షల సంఖ్యలో ఉన్నారు. వారు ఏదైనా బలమైన తార్కిక వాదనను కనుగొని ఉంటే, వారు సర్వశక్తిమంతుడైన దేవుని ఉనికిని తిరస్కరించేవారు కాదని స్పష్టమే. మహిమాన్వితమైన సృష్టికర్త ఉనికికి సంబంధించిన తిరుగులేని తార్కిక వాదన ద్వారా వారు తప్పు అని నిరూపించబడి ఉంటే, వారు అత్యంత సిగ్గులేకుండా, నిర్లక్ష్యంగా మరియు పరిహాసంతో సర్వశక్తిమంతుడైన దేవుని ఉనికిని తిరస్కరించేవారు కాదు. కాబట్టి, తత్వవేత్తల నౌకలో ప్రయాణిస్తూ ఎవరూ కూడ సందేహాల తుఫాను నుండి రక్షించబడలేరు. బదులుగా, అతను తప్పకుండా మునిగిపోతాడు మరియు ఎప్పటికీ స్వచ్ఛమైన తౌహీద్ యొక్క అమృతం నుండి వంచితుడవుతాడు.


"ఇప్పుడు ఆలోచించండి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క మాధ్యమం లేకుండా తౌహీద్ సాధించవచ్చని మరియు రక్షణ పొందవచ్చని భావించడం ఎంత అసత్యమైనది మరియు దుర్గంధమైన ఆలోచనో. ఓ అజ్ఞానులారా! దేవుని ఉనికి గురించి సంపూర్ణ నిశ్చయత కలగకముందు ఆయన తౌహీద్‌పై విశ్వాసం ఎలా కలుగుతుంది? కాబట్టి ఖచ్చితంగా తెలుసుకోండి, తౌహీద్ యొక్క నిశ్చయత ఒక ప్రవక్త ద్వారానే పొందవచ్చు, ఎందుకంటే మన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వేలాది ఆకాశ సూచనలను చూపించి అరేబియాలోని నాస్తికులను మరియు బహుదైవారాధకులను సర్వశక్తిమంతుడైన దేవుని ఉనికి గురించి నమ్మించారు. ఈ రోజుకీ కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క నిజమైన మరియు సంపూర్ణ అనుచరులు ఆ సూచనలను నాస్తికులకు చూపిస్తున్నారు. నిజంగా సత్యమైన విషయం ఏమిటంటే, ఒక వ్యక్తి జీవించే దేవుని జీవశక్తులను గమనించే వరకు, షైతాన్ అతని హృదయం నుండి తొలగిపోడు, నిజమైన తౌహీద్ అందులో ప్రవేశించదు, అలాగే దేవుని ఉనికి గురించి అతనికి నిశ్చయమైన విశ్వాసం కలగదు. ఈ పవిత్రమైన మరియు సంపూర్ణమైన తౌహీద్ కేవలం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారానే పొందబడుతుంది."

(హఖీఖతుల్ వహీ, రూహాని ఖజాయిన్ సంపుటి 22, పేజి 118-121)

అందువల్ల, ఇది నిజమైన తౌహీద్, దానిని సాధించడానికి మనం కృషి చేయాలి మరియు నిజాయితీగా అన్వేషించాలి. మన విశ్వాసాన్ని అలాంటి స్థాయికి పెంచడానికి ప్రయత్నించాలి, అంతేగాకా ప్రతి త్యాగానికి సిద్ధంగా ఉండాలి. దైవ ప్రవక్త (స) పట్ల నిజమైన మరియు హృదయపూర్వక ప్రేమను మనలో పెంపొందించుకోవాలి.

ఈ యుగంలో, తౌహీద్ స్థాపన కార్యాన్ని కొనసాగించడానికి సర్వోన్నతుడైన అల్లాహ్ దైవ ప్రవక్త (స) యొక్క నిజమైన సేవకుడిని పంపాడు, మరియు ఇదే ఉద్దేశంతో మనం ఆయన బైఅత్ చేశాము. కాబట్టి, ఈ బైఅత్ యొక్క హక్కులను నెరవేర్చడానికి మనం అత్యంత శక్తితో ప్రయత్నించాలి, అలాగే దీనికోసం ప్రార్థించాలి. రమజాన్ మిగిలిన రోజులలో, ముఖ్యంగా, తౌహీద్ స్థాపన కోసం మరియు దాని గౌరవాన్ని కాపాడటానికి ముందుండి కృషి చేసే వారిలో మనలను చేర్చమని ప్రార్థించాలి. సర్వోన్నతుడైన అల్లాహ్ మనకు అలా చేయగల సామర్థ్యాన్ని ప్రసాదించి, మన బలహీనతలను తొలగించుగాకా!.

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA, TIFFIN, MEALS, CHICKEN-BIRYANI, FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

ముస్లిం సమాజం విషయానికి వస్తే, గత శుక్రవారం కూడా నేను చెప్పినట్లుగా, వారి కోసం ప్రార్థనలు చేయాలి, తద్వారా వారు కూడా తౌహీద్ యొక్క నిజమైన వాస్తవాన్ని అర్థం చేసుకుని దానిపై ఆచరించగలుగుతారు. అప్పుడే వారి మనుగడకు భరోసా ఉంటుంది. అప్పుడే వారు తమ శత్రువుల మోసపూరిత పన్నాగాల నుండి రక్షించబడగలరు. సర్వోన్నతుడైన అల్లాహ్ వారికి అలా చేయగల సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!.

జుమా తర్వాత, ఈ రోజు కొన్ని రోజుల క్రితం 80 సంవత్సరాల వయస్సులో మరణించిన, జమాత్ మిషనరీగా సేవలందించిన గౌరవనీయులైన జిక్రుల్లాహ్ తయో అయ్యూబా సాహిబ్ గారి పరోక్ష జనాజ నమాజ్ చదివించుతాను. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కృపతో, ఆయన ఒక ముసీ. ఆయన నైజీరియాకు చెందినవారు.

1965లో, ఒక కల ద్వారా ఆయన అహ్మదియ్యత్‌ను స్వీకరించారు. 1966లో, ఆయన ఘానాలోని జామిఅలో చేరారు. అక్కడ తన ప్రాథమిక అధ్యయనాలను పూర్తి చేసిన తర్వాత, 1969లో నైజీరియాకు తిరిగి వచ్చారు. అక్కడ ఒక సంవత్సరం సేవ చేసిన అనంతరం, షాహిద్ డిగ్రీని అభ్యసించడానికి 1970లో జామియా అహ్మదియ్యా రబ్వాలో ప్రవేశించారు. 1977లో ఆయన మౌల్వీ ఫాజిల్ పరీక్షను కూడా ఉత్తీర్ణులయ్యారు, మరియు 1979లో షాహిద్ డిగ్రీని పొందారు. అనంతరం, ఆయన నైజీరియాకు తిరిగి వెళ్లి అక్కడ సేవ చేయడం ప్రారంభించారు, తన మరణం వరకు సేవలో కొనసాగారు. సుమారు 47 సంవత్సరాల పాటు సేవ చేసే అవకాశం ఆయనకు లభించింది.

ఆయన నైజీరియా అంతటా వివిధ ప్రాంతాల్లో సేవ చేశారు మరియు నాయిబ్ అమీర్‌గా కూడా సేవలందించారు. ఆయన జర్నలిజంలో పీజీ డిగ్రీని కూడా పొందారు, అందువల్ల ఈ రంగానికి కూడా తన సేవలను అందించారు. ఆయనను జామియతుల్ ముబాషిరీన్ నైజీరియా ప్రిన్సిపాల్‌గా నియమించారు – – మొదట తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా, తరువాత మూడు నుండి నాలుగు సంవత్సరాల పాటు ప్రిన్సిపాల్‌గా సేవ చేశారు.

ఆయన ఒక అద్భుతమైన క్రీడాకారుడు కూడా మరియు క్రీడలపై గొప్ప ఆసక్తి కలిగి ఉండేవారు, అయినప్పటికీ ఈ కార్యకలాపాలు తన ఆరాధనకు ఆటంకంగా మారనివ్వలేదు. ఆయన మంచి రచయిత, భాషావేత్త మరియు కవి. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు మరియు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఆయన చిన్న కుమారుడు, అబ్దుల్ ముజీబ్ సాహిబ్, ప్రస్తుతం నైజీరియాలో జమాత్ మిషనరీగా అలాగే నైజీరియాలో ది రివ్యూ ఆఫ్ రిలిజన్స్ సమన్వయకర్తగా సేవ చేస్తున్నారు. ఆయన వక్ఫ్–ఎ–జిందగీ (జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి).

మిషనరీ–ఇన్–చార్జ్, తాహిర్ అద్నాన్ సాహిబ్ ఇలా తెలిపారు. మృతుడు ఎంతో ధార్మికులు, విధేయులు మరియు జమాత్ సేవకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే వారు. ఆయనను 20 సంవత్సరాలకు పైగా సన్నిహితంగా గమనించే అవకాశం తనకు లభించిందని, ఆ కాలంలో ఆయన ఉన్నత నైతిక స్వభావం, వినయం, అణకువ మరియు ఖిలాఫత్ పట్ల, అలాగే నిజామ్–ఎ–జమాత్ పట్ల ఆయన చూపిన అసాధారణ విశ్వాసం మరియు విధేయతకు సంబంధించిన అనేక ఉదాహరణలను చూశానని ఆయన వ్రాసారు. ఇంకా ఆయన ఇలా వ్రాస్తున్నారు: మృతుడు వయస్సులో తనకంటే పెద్దవారైనప్పటికీ, తాను మిషనరీ–ఇన్–చార్జ్‌గా నియమితులైనప్పుడు, మృతుడు తన సూచనలను స్వీకరించడంలో మరియు అమలు చేయడంలో సంపూర్ణ విశ్వాసం, బాధ్యత మరియు విధేయతను ప్రదర్శించారు.

అదేవిధంగా, జమాత్ మిషనరీ అయిన యూసుఫ్ ఖాలిక్ సాహిబ్ ఇలా వ్రాసారు: ప్రిన్సిపాల్‌గా ఆయన విద్యార్థుల నైతిక మరియు ఆధ్యాత్మిక శిక్షణపై అసాధారణ శ్రద్ధ చూపారని తెలిపారు. ఆయన వారిలో బాధ్యతా భావాన్ని పెంపొందించారు మరియు ఏ పనికైనా ఎప్పుడూ సాకులు చెప్పవద్దని వారికి ఎల్లప్పుడూ సలహా ఇచ్చేవారు. వర్తమాన ఖలీఫా సూచనలను వెంటనే అమలు చేయడంపై ఆయన ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఆచరణాత్మక శిక్షణ కోసం, ఆయన విద్యార్థులను ప్రచార యాత్రలకు కూడా పంపేవారు. ప్రతి విషయంలోనూ ఆయన స్వయంగా ఒక ఆదర్శాన్ని చూపించారు, ఇది విద్యార్థుల జీవితాలపై లోతైన ప్రభావాన్ని చూపింది.

నేను స్వయంగా ఆయనను చూశాను; ఆయన అత్యంత నిజాయితీగల, విశ్వాసపాత్రమైన మరియు ఎంతో వినయశీలమైన వ్యక్తి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనను మన్నించి, కరుణించి, ఆయన స్థాయిని ఉన్నతం చేయుగాకా!. ఆమీన్.




## సీరతుల్ మహ్ది ( అలైహిస్సలాతు వస్సలాం):-

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

అపార దయామయుడు పరమకారుణ్య మూర్తి అల్లాహ్ పేరుతో:

(8) గౌరవనీయ మా తల్లి గారు నాకు ఇలా వివరించారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒకసారి ఈ సంఘటనను వివరించారు.

ఒకసారి నేను ఒక న్యాయవ్యవహారానికి సంబంధించి డల్హౌసీ కొండ ప్రాంతానికి ప్రయాణం చేస్తున్నాను. మార్గమధ్యంలో వర్షం ప్రారంభమైంది. నేను మరియు నా సహచరుడు మా బండిలో నుండి దిగి, రహదారి పక్కన ఉన్న ఒక కొండవాసి ఇంటి వైపు వెళ్లాము. నా సహచరుడు ముందుగా వెళ్లి ఇంటి యజమానిని లోపలికి అనుమతించమని కోరాడు. కానీ అతను నిరాకరించాడు. దీంతో వారిద్దరి మధ్య వాదన మొదలైంది. ఇంటి యజమాని కోపగించి దుర్భాషలు మాట్లాడడం ప్రారంభించాడు.హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: "ఆ వాదన వినగానే నేను ముందుకు వెళ్లాను. నా కళ్ళు ఆ ఇంటి యజమాని కళ్ళతో కలిసిన వెంటనే, నేను ఒక్క మాట కూడా మాట్లాడకముందే, అతను తన తలను వంచి ఇలా అన్నాడు: 'నిజానికి నా ఇంట్లో ఒక యువ కుమార్తె ఉంది. అందువల్ల నేను అపరిచితులను ఇంట్లోకి అనుమతించను. అయితే మీరు మాత్రం నిరభ్యంతరంగా లోపలికి రావచ్చు." హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరచూ ఇలా చెప్పేవారు: "అతను నాకు పూర్తిగా అపరిచితుడు. నేను అతన్ని ఎరుగను, అతనూ నన్ను ఎరుగడు."

(9) గౌరవనీయ మా తల్లి గారు మరొక సంఘటనను కూడా వివరించారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు:

ఒకసారి నేను ప్రయాణంలో ఉన్నప్పుడు, మేము ఒక భవనం రెండవ అంతస్తులోని పైగదిలో రాత్రి బస చేశాము. అదే గదిలో మరో ఏడుగురు లేదా ఎనిమిది మంది కూడా ఉన్నారు. అందరూ నిద్రపోయిన తరువాత, రాత్రి కొంత భాగం గడిచినప్పుడు, నాకు ఏదో తట్టినట్లుగా లేదా కీచుమనే శబ్దం వినిపించింది. ఆ గది పైకప్పు కూలిపోతుందేమో అనే ఆందోళన నా మనసులో కలిగింది. నేను నా సహచరుడు మసీతా బేగ్‌ను పిలిచి ఇలా అన్నాను: "ఈ పైకప్పు కూలిపోతుందేమోనని నాకు భయంగా ఉంది." అతను ఇలా సమాధానమిచ్చాడు: "మియాం, ఇది మీ ఊహ మాత్రమే. ఈ భవనం కొత్తగా నిర్మించబడింది. పైకప్పు కూడా కొత్తదే. ప్రశాంతంగా నిద్రపోండి." హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: నేను మళ్లీ పడుకున్నాను. కానీ కొద్దిసేపటికి అదే భయం మళ్లీ నన్ను ఆవరించింది. నేను మరోసారి నా సహచరుడిని లేపాను. అతను మళ్లీ అదే సమాధానం ఇచ్చాడు. అందువల్ల నేను ఇష్టంలేకపోయినా మళ్లీ పడుకున్నాను. అయితే కొంతసేపటి తరువాత ఆ భావన మరింత బలంగా తిరిగి వచ్చింది. ఒక పెద్ద దూలం విరిగిపోబోతున్నట్లుగా అనిపించింది. నేను భయపడి లేచి ఈసారి గట్టిగా ఇలా అన్నాను: "నేను పైకప్పు కూలిపోబోతుందని చెబుతున్నాను. మరి నువ్వెందుకు లేవడం లేదు?" చివరకు అతను లేచాడు. మేమిద్దరం కలిసి గదిలోని మిగిలిన వారినీ లేపాము. తర్వాత హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా ఆదేశించారు: "త్వరగా బయటకు వెళ్లి కిందికి దిగండి." తలుపు పక్కనే మెట్లు ఉన్నాయి. హుజూర్ (అ) తలుపు దగ్గర నిలబడి ఉండగా, మిగిలినవారు ఒక్కొక్కరుగా బయటకు వెళ్లి కిందికి దిగారు.అందరూ బయటకు వెళ్లిన తరువాత, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: "ఆ తర్వాత నేను కూడా ముందుకు ఒక అడుగు వేశాను. నా పాదం సగం బయటకు, సగం గడపపై ఉండగానే, ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. అది అంతటి బలంతో కూలింది కాబట్టి, కింద అంతస్తు పైకప్పు కూడా దానితోపాటు కూలిపోయింది." మరల ఇలా తెలిపారు: "మేము నిద్రించిన మంచాలు పూర్తిగా ముక్కలైపోయినాయి. " ఆ కథను విన్న నేను తల్లి గారిని ఇలా అడిగాడు: "మసీతా బేగ్ ఎవరు?" ఆమె ఇలా సమాధానమిచ్చారు: "అతను మీ తాతగారికి దూరపు బంధువు. అలాగే ఆయన వద్ద పని కూడా చేసేవాడు." కథకుడు ఇలా పేర్కొన్నాడు: రెండవ ఖలీఫా ఒకసారి ఈ సంఘటనను వివరించేటప్పుడు, ఇది సియాల్కోట్‌లో జరిగినదని చెప్పారు. ఆ సమయంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అక్కడే ఉద్యోగం చేస్తున్నారు. మరల ఇలా తెలిపారు. "ఆ సమయంలో పైకప్పు తాను బయటకు వెళ్లే వరకు వేచి చూసినట్లుగా అనిపించిందని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చెప్పేవారు." అలాగే ఆ గదిలో కొంతమంది హిందువులు కూడా ఉన్నారని, ఈ సంఘటనను చూసిన తరువాత వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పట్ల ఎంతో గౌరవం మరియు అభిమానాన్ని పెంచుకున్నారని రెండవ ఖలీఫా పేర్కొన్నారు.

| | |
|---|---|
| **వర్తమాన ఖలీఫా వాఖ్యములు** | **"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. "** **(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

# జుమా ప్రసంగము

**"ఒక విశ్వాసి యొక్క ప్రాపంచిక సంబంధాలు ఎంత వైవిధ్యంగా ఉంటాయో, అతను అంత ఉన్నత స్థాయిలకు ఎదుగుతాడు, ఎందుకంటే అతని ప్రధాన లక్ష్యం ధర్మమే."**

---

**మనిషి ఈ ప్రపంచంలో శ్రమించాలి, కానీ అది విశ్వాసానికి సేవ చేయడానికి మాత్రమే. మహోన్నతుడైన అల్లాహ్ మనకు ఈ ప్రార్థనను నేర్పించాడు: రబ్బనా ఆతినా ఫిద్దునియాఁ హసతన్ వఫిల్ ఆఖిరతి హసనతన్ వఖినా అజాబన్నార్ అనగా 'ఓ మా ప్రభువా! ఈ లోకంలో మాకు మంచిని ప్రసాదించు, పరలోకంలో కూడా మాకు మంచిని ప్రసాదించు. మరియు అగ్ని శిక్ష నుండి మమ్మల్ని రక్షించుము.'**

---

**నేను పేర్కొన్నట్లుగా, ప్రపంచం వినాశనపు గోతివైపు కదులుతోంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనలను దాని నుండి రక్షించుగాకా! మన కర్మలను మెరుగు పరచుకునేలా అల్లాహ్ మనకు సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 20 మార్చి 2026 ( 20 అమాన్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ
أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ۔
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ۔
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ۔

ఈ రోజు నేను ఈద్ ఖుత్బా కూడా ఇచ్చాను. అందువల్ల ఇప్పుడు నేను కొంత సంక్షిప్తమైన ప్రసంగాన్ని చేస్తాను. ఇందుకోసం నేను హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి రచనల నుండి ఒక భాగాన్ని తీసుకున్నాను. దీని వైపు ఎల్లప్పుడు మనం ఆసక్తిని కనబర్చుతూ ఉండాలి. వారు (అ) ఇలా పేర్కొన్నారు:

"ఒక విశ్వాసి యొక్క ప్రాపంచిక సంబంధాలు ఎంత వైవిధ్యంగా ఉంటాయో, అతను అంత ఉన్నత స్థాయిలకు ఎదుగుతాడు, ఎందుకంటే అతని ప్రధాన లక్ష్యం ధర్మమే."

ప్రాపంచిక పరమైన సంబంధాలు కూడా మంచివిగా మరియు విస్తృతంగా ఉండటానికి కారణం వాటి ఉద్దేశ్యం ధర్మమే కావడం. మరో మాటలో చెప్పాలంటే, ప్రాపంచిక సంబంధాల ఉద్దేశ్యమే ధర్మం కావాలి; ఇదే ఒక నిజమైన విశ్వాసి యొక్క లక్షణం.

"ప్రపంచం, దాని సంపద మరియు గౌరవం, అన్నియు ధర్మానికే సేవ చేయాలి. కాబట్టి ప్రాథమిక సూత్రం ఏమిటంటే, ప్రపంచం మన అంతిమ లక్ష్యంగా ఉండకూడదు. వాస్తవానికి, ప్రాపంచిక వ్యవహారాలను అనుసరించేటప్పుడు ధర్మమే ప్రధాన ఉద్దేశ్యమై ఉండాలి."

అందువల్ల నిజమైన సూత్రం ఏమిటంటే, ప్రపంచం స్వయంగా అంతిమ లక్ష్యంగా ఉండకూడదు; దానిని సంపాదించడంలోని అసలు లక్ష్యం ధర్మాన్ని సంపాదించడమే కావాలి. అంటే, మనం ప్రాపంచిక సంపదను సంపాదించినా, దాని ఉద్దేశ్యం మన విశ్వాసం మెరుగుపడటానికి మరియు మన ధర్మానికి సేవ చేయడానికి ఉండాలి. మనం సంపాదించే ప్రాపంచిక సాధనాలు మన విశ్వాస అభివృద్ధికి ఉపయోగపడాలి. అంతేగాని తప్పుడు మార్గాలను అనుసరించి మన ప్రాపంచిక జీవితాన్నీ, పరలోకాన్నీ నాశనం చేసుకోకూడదు. నిజానికి మన పరలోకాన్ని అలంకరించేలా మరియు మన విశ్వాసాన్ని బలపరిచేలా మాత్రమే ప్రపంచాన్ని సంపాదించాలి. మరల ఇలా తెలిపారు. "ప్రపంచాన్ని కూడా ధర్మానికి సేవ చేసే విధంగా అనుసరించాలి. ఉదాహరణకు, ఒక వ్యక్తి ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి ప్రయాణిస్తున్నప్పుడు, అతను ప్రయాణానికి అవసరమైన వాహనాన్ని మరియు సరుకులను తీసుకుంటాడు. అతను అలా చేయడానికి కారణం తన తుది గమ్యాన్ని చేరుకోవడమే, వాహనం కోసం గానీ, ప్రయాణ సామగ్రి కోసం గానీ కాదు."

ఈ వస్తువులన్నియు ప్రయాణాన్ని సులభతరం చేయడానికి మాత్రమే తీసుకోబడతాయి, తద్వారా వ్యక్తి సౌకర్యంగా ప్రయాణించి తన గమ్యస్థానాన్ని చేరుకోగలడు. మార్గమధ్యంలో వాటిలో మునిగిపోవడం కోసం కాదు.

"అదే విధంగా, మనిషి ఈ ప్రపంచంలో శ్రమించాలి, కానీ అది విశ్వాసానికి సేవ చేయడానికి మాత్రమే. మహోన్నతుడైన అల్లాహ్ మనకు ఈ ప్రార్థనను నేర్పించాడు:

రబ్బనా ఆతినా ఫిద్దునియాఁ హసతన్ వఫిల్ ఆఖిరతి హసనతన్ వఖినా అజాబన్నార్ అనగా 'ఓ మా ప్రభువా! ఈ లోకంలో మాకు మంచిని ప్రసాదించు, పరలోకంలో కూడా మాకు మంచిని ప్రసాదించు. మరియు అగ్ని శిక్ష నుండి మమ్మల్ని రక్షించుము.' (బఖర:202)

మరల వారు (అ) ఇలా తెలిపారు. అల్లాహ్ తాలా మనకు నేర్పించిన ఈ దుఆ రబ్బనా ఆతినా ఫిద్దునియాఁ హసతన్ వఫిల్ ఆఖిరతి హసనతన్ వఖినా అజాబన్నార్ అనగా, ఓ అల్లాహ్!, ఈ లోకంలోని మేలును మరియు పరలోకంలోని మేలును రెండింటిని మాకు ప్రసాదించుము (బఖర:202)లో కూడ ఈ లోకానికి ప్రాధాన్యత ఇవ్వబడింది, కానీ ఏ 'లోకం' గురించి?. అది ఈ లోకంలోని మంచిని (హసనాత్–ఉద్దున్యా), ఇది పరలోకంలో మంచిని పొందడానికి ఒక సాధనంగా మారుతుంది." ఎటువంటి లోకం, దానిని పొందిన తరువాత పరలోకంలో ప్రయోజనాన్ని చేకూర్చే లోకం. ఈ లోకంలో మనం పొందవలసినవి, పరలోకంలోని మేలుకు దారితీసేవిగా ఉండాలి. అవి పరలోకంలో సిగ్గు మరియు పశ్చాత్తాపానికి కారణంగా మారకూడదు. ఒక వ్యక్తి కేవలం ఈ లోకంలోనే పూర్తిగా మునిగిపోతే, అతడు తప్పకుండా పరలోకంలో పశ్చాత్తాపాన్ని ఎదుర్కొంటాడు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు:

"ఈ దుఆ ద్వార మనకు బోధించబడిన వాస్తవం ఏమిటనగా, ఒక విశ్వాసి ఈ లోకాన్ని పొందడంలో పరలోక మేలును దృష్టిలో ఉంచుకోవాలని స్పష్టంగా చూపిస్తుంది. ఇక్కడ పేర్కొన్న హసనాత్–ఉద్దున్యా అనే పదాలు, ఒక ముస్లిం విశ్వాసి ఈ లోకాన్ని అనుసరించడానికి ఉపయోగించవలసిన అత్యుత్తమ మార్గాలన్నింటినీ కలిగి ఉంటాయి. ఈ లోకాన్ని అన్ని విధాలుగానూ అనుసరించండి, అది ప్రయోజనం మరియు మేలుకు దారితీసే విధంగా ఉండాలి. మరొక మనిషికి బాధ కలిగించే విధంగా కాకూడదు, అలాగే ప్రజల మధ్య అవమానకరమైన లేదా నీచమైన విధంగా కాకూడదు. ఈ విధంగా ఈ లోకంలో నిమగ్నమవడం తప్పకుండా పరలోక మేలును (హసనాత్–ఉల్–ఆఖిరహ్) పొందడానికి సహాయపడుతుంది."

(మల్ఫూజాత్, సంపుటి 2, పుటలు 91–92, ప్రచురణ 1984,)

మీకు మాత్రమే కాకుండా, మానవాళికి కూడా ప్రయోజనం చేకూర్చే విధమైన ఈ లోక సంపదను సంపాదించండి. మీ ప్రాపంచిక జీవితంలో మీకు, మీ కుటుంబానికి లేదా మీ బంధువులకు సిగ్గు కలిగించే ఎటువంటి కార్యాలు ఉండ కూడదు. బదులుగా, మీ జీవితం పవిత్రమైనది మరియు సన్మార్గమైనదిగా ఉండాలి. అది భక్తి మరియు నీతిపై ఆధారపడి సాగాలి. అటువంటి జీవితం స్థాపించబడినప్పుడు, మరియు మీరు ఈ విధంగా ఈ లోకాన్ని సంపాదించడానికి మీ జీవితాన్ని అంకితం చేసినప్పుడు, అది మీకు ఈ లోకంలోనూ మరియు పరలోకంలోనూ శుభములను తీసుకువస్తుంది.

అందువల్ల, నేడు సాధారణంగా ప్రపంచం తన స్వంత లక్ష్యాలు మరియు ప్రయోజనాల సాధనలో మునిగిపోయినప్పుడు, మరియు వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతున్నప్పుడు, ఉదాహరణకు, మనం దేశాలను పరిశీలిస్తే, అవి మానవాళి మొత్తానికి కాకుండా తమ స్వంత ప్రజల గురించే మాత్రమే ఆలోచిస్తున్నాయి. ఈ ధోరణిలో మునిగిపోవడం ద్వారా, వాస్తవానికి అవి తమ స్వంత వినాశనానికి మార్గాలను సిద్ధం చేసుకుంటున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో, ఈ లోకం మరియు పరలోకం రెండింటి శుభములను సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి కోరడంపై మన దృష్టిని మళ్లించాలి. ఈ పరిస్థితుల్లో, మన ప్రాపంచిక జీవితాన్ని మరియు పరలోకాన్ని సరిచేసుకుని, అన్ని రకాల విపత్తుల నుండి రక్షించబడేందుకు మనం దీనిపై మరింతగా దృష్టి పెట్టాలి.

నేను పేర్కొన్నట్లుగా, ప్రపంచం వినాశనపు గోతివైపు కదులుతోంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనలను దాని నుండి రక్షించుగాకా! మన కర్మలను మెరుగు పరచుకునేలా అల్లాహ్ మనకు సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా! మరియు నేను ఇంతకు ముందు ఖుత్బాలో పేర్కొన్నట్లుగా, నిజాయితీతో కూడిన ప్రార్థనలు చేసే శక్తిని మనకు అనుగ్రహించుగాకా!. అల్లాహ్ మనకు ఈ ఆశీర్వాదాలను నిజంగా పొందే సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా! అత్యుత్తమమైన ప్రార్థనలు చేసేలా చేయుగాకా! మరియు వాటిని కూడా స్వీకరించుగాకా!. ఆమీన్.

## సీరత్ ఖాతమున్నబియ్యీన్ (సల్లల్లాహు అలైహి వసల్లం):-

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

**అబ్దుల్ మనాఫ్:-**

కుసయ్యీకు నలుగురు కుమారులు ఉన్నారు: అబ్దుల్ దార్, అబ్దుల్ ఉజ్జా, అబ్దుల్ మనాఫ్, అబ్దుల్ కుసయ్యీ. అబ్దుల్ దార్ పెద్ద కుమారుడు కావడంతో, కుసయ్యీ తన మరణానికి ముందు కాబా సంరక్షణకు సంబంధించిన మూడు పదవులు, అలాగే దార్ అల్-నద్వా (సభా మందిరం) నిర్వహణ మరియు లివా (జెండా బాధ్యత) సహా తన అధికారాలన్నింటినీ అతనికి అప్పగించాడు. అయితే అబ్దుల్-దార్ తన తండ్రి స్థాయి సామర్థ్యాన్ని కలిగి లేడు. అందువల్ల ఖురైష్ ప్రజల సాధారణ నాయకత్వం అత్యంత ప్రతిభావంతుడు, గౌరవనీయుడు అయిన అబ్ద్ మనాఫ్ చేతుల్లోకి వెళ్లింది.

**అబ్దుల్ మనాఫ్‌కు నలుగురు కుమారులు ఉన్నారు:**

అబ్దుల్ శంష్, ముత్తలిబ్, హాశిం, నవ్ఫల్. ఈ నలుగురూ తమ తండ్రి ప్రతిభను వారసత్వంగా పొందారు. అబ్దుల్ మనాఫ్ మరణం తర్వాత, వారు కలిసి అబ్దుల్ దార్ సంతతి నుండి కాబా సంరక్షణ హక్కును తీసుకోవడానికి ప్రయత్నించారు. దీనివల్ల రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. ఖురైష్‌లోని కొన్ని తెగలు ఒక పక్షానికి, మరికొన్ని మరో పక్షానికి మద్దతు ఇవ్వడంతో యుద్ధం జరిగే పరిస్థితి ఏర్పడింది. చివరకు శాంతియుత ఒప్పందం కుదిరింది. యాత్రికులకు ఆహారం అందించే రిఫాదా మరియు నీరు అందించే సికాయా అనే రెండు పదవులు అబ్దుల్ మనాఫ్ సంతతికి అప్పగించబడ్డాయి. మిగిలిన మూడు పదవులు, దార్ అల్-నద్వా నిర్వహణ, లివా మరియు హిజాబా (కాబా సంరక్షణ)---అబ్దుల్ దార్ సంతతి వద్దనే కొనసాగాయి. ఆ తరువాత అబ్దుల్ మనాఫ్ సంతతి పరస్పర అంగీకారంతో హాశింను సికాయా మరియు రిఫాదా బాధ్యతల నిర్వాహకునిగా నియమించింది.

**హాశిం:-**

హాశిం అత్యంత తెలివైన, వివేకవంతుడు, ఉదార స్వభావం కలిగిన వ్యక్తి. అతను హజ్ యాత్రికులకు గొప్ప సౌకర్యాలు కల్పించాడు మరియు వారి అవసరాల కోసం ఖురైష్ ప్రజలను సహాయం చేయడానికి ప్రోత్సహించాడు. అతని కాలంలో ఒకసారి తీవ్రమైన కరువు వచ్చింది. అప్పుడు హాశిం తన స్వంత సంపదను ఖర్చు చేసి పేదలకు సహాయం చేశాడు. అతని దాతృత్వం వల్ల అతని పేరు దూరదూరాల వరకు ప్రసిద్ధి చెందింది. హాశిం స్వయంగా రోమన్ మరియు ఘస్సానీ పాలకులతో చర్చలు జరిపి ఖురైష్ వ్యాపార బృందాలకు ప్రత్యేక హక్కులు సాధించాడు. అతని సోదరులు కూడా ఇలాంటి సేవలు అందించారు. ఫలితంగా ఖురైష్ వ్యాపార బృందాలు సిరియా (షామ్) మరియు యెమెన్‌లకు క్రమం తప్పకుండా ప్రయాణించడం హాశిం కాలంలో ప్రారంభమైంది.

సాధారణంగా: శీతాకాలంలో వ్యాపార బృందాలు యెమెన్‌కు వెళ్తుండేవి. వేసవి కాలంలో సిరియాకు వెళ్తుండేవి. ఈ ప్రయాణాలను, రిహ్లత షితా (శీతాకాల యాత్ర), రిహ్లత సైఫ్ (వేసవి యాత్ర) అని పిలిచేవారు.

**ఉమయ్యా ప్రత్యర్థిత్వం:-**

హాశింకు పెరుగుతున్న ప్రభావాన్ని చూసి అతని సోదరుడి కుమారుడు ఉమయ్యా బిన్‌అబ్దేశంష్ అసూయచెందాడు. హాశింకు పోటీగా నిలవాలని ప్రయత్నించాడు. అతను కూడా దాతృత్వం ద్వారా పేరు సంపాదించాలని చూశాడు, కానీ విఫలమయ్యాడు. ఫలితంగా ఖురైష్ ప్రజల హాస్యానికి గురయ్యాడు. చివరకు ఉమయ్యా బహిరంగంగా హాశింకు సవాలు విసిరాడు. మొదట హాశిం పట్టించుకోలేదు. కానీ ఇలాంటి పోటీలను చూడటానికి ఇష్టపడే ఖురైష్‌ల ఒత్తిడితో అతను అంగీకరించాడు.

**పోటీ నిబంధనలు:**

ఒక మధ్యవర్తి ఎవరు గొప్పవారో నిర్ణయించాలి.

ఓడిపోయినవాడు గెలిచినవారికి 50 ఒంటెలు ఇవ్వాలి.

ఓడినవాడు 10 సంవత్సరాలు మక్కా నుండి బహిష్కృతుడై ఉండాలి.

ఖుజాఆ తెగకు చెందిన ఒక జ్యోతిష్కుడు మధ్యవర్తిగా నియమించబడ్డాడు. అతను కొన్ని సంప్రదాయ మాటలు చెప్పి హాశింకు అనుకూలంగా తీర్పు ఇచ్చాడు. దీని ప్రకారం ఉమయ్యా 50 ఒంటెలను హాశింకు ఇచ్చి మక్కాను విడిచి వెళ్లిపోయాడు. తరువాతి పది సంవత్సరాలు సిరియా మరియు ఇతర ప్రాంతాల్లో గడిపాడు. చరిత్రకారులు దీనినే బను హాశిం మరియు బను ఉమయ్యా మధ్య ప్రసిద్ధ శత్రుత్వానికి ఆరంభంగా భావిస్తారు. హాశిం తర్వాత అతని కుమారుడు అబ్దుల్ ముత్తలిబ్ బను హాశిం ఆధిపత్యాన్ని కొనసాగించాడు. అయితే అతని మరణం తర్వాత అతనంత ప్రభావవంతమైన నాయకుడు కాలేకపోవడంతో బను ఉమయ్యా క్రమంగా బలపడగా, హాశిమీ కుటుంబం బలహీనమైంది.

**హాశిం వివాహం మరియు కుమారుడు:-**

సిరియాకు చేసిన ఒక వ్యాపార యాత్రలో హాశిం యస్రిబ్ (మదీనా) వద్ద ఆగాడు. అక్కడ ఖజ్రజ్ తెగలోని బను నజ్జార్ వంశానికి చెందిన సల్మా అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వారికి మదీనాలో ఒక కుమారుడు జన్మించాడు. అతనికి షైబా అని పేరు పెట్టారు.

ముత్తలిబ్:- కొంతకాలం తరువాత హాశిం ప్రయాణంలోనే మరణించాడు. అతనికి నలుగురు కుమారులు ఉన్నారు: అబూ సైఫీ, అసద్, ఫదాలా, షైబా. వారంతా చిన్నవాళ్లు కావడంతో, ముఖ్యంగా షైబా మదీనాలోనే ఉండటంతో, హాశిం పెద్ద సోదరుడు ముత్తలిబ్ సికాయా మరియు రిఫాదా బాధ్యతలను స్వీకరించాడు. తరువాత షైబా తెలివితేటల గురించి విని, ముత్తలిబ్ మదీనాకు వెళ్లి అతన్ని మక్కాకు తీసుకొచ్చాడు. పిన్నాన్న - సోదరుడి కుమారుడు కలిసి మక్కాలో ప్రవేశించినప్పుడు, ప్రజలు షైబాను ముత్తలిబ్ బానిస అనుకున్నారు. అందువల్ల అతను అబ్దుల్ ముత్తలిబ్ ("ముత్తలిబ్ సేవకుడు") అనే పేరుతో ప్రసిద్ధి చెందాడు. ఇదే అబ్దుల్ ముత్తలిబ్, తరువాత ప్రవక్త ముహమ్మద్ గారి తాతయ్య అయ్యాడు. ప్రవక్త తన జీవితంలోని మొదటి ఎనిమిది సంవత్సరాలు ఆయన సంరక్షణలో గడిపారు.

**అబ్దుల్ ముత్తలిబ్:-**

ముత్తలిబ్ కేవలం సంరక్షకుడిగా వ్యవహరించినందున, అతని మరణం తర్వాత అబ్దుల్ మనాఫ్ కుటుంబానికి చెందిన అధికారాలు అబ్దుల్ ముత్తలిబ్‌కు వచ్చాయి. అబ్దుల్ ముత్తలిబ్ తెలివైన మరియు సమర్థుడైన వ్యక్తి. కానీ అతను ఇంకా యువకుడిగా ఉండడం, తన జీవితంలో కొంత భాగం మక్కా వెలుపల గడపడం వల్ల మొదట్లో తన స్థానాన్ని స్థిరపరచుకోవడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అతని వారసత్వంపై మొదటి వివాదం అతని పిన్నాన్న నవ్ఫల్ బిన్ అబ్ద్ మనాఫ్ నుండి వచ్చింది. అబ్దుల్ ముత్తలిబ్ ఖురైష్‌ను ఆశ్రయించినప్పటికీ వారు జోక్యం చేసుకోవడానికి నిరాకరించారు.అప్పుడు అతను యస్రిబ్‌లోని తన మాతృ బంధువులైన బను నజ్జార్ వారికి సందేశం పంపాడు. వెంటనే 80 మంది యోధులు మక్కాకు వచ్చి అతనికి మద్దతు ఇచ్చారు. వారు నవ్ఫల్‌ను ఎదుర్కొని వారసత్వాన్ని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయగా, నవ్ఫల్ భయపడి తన హక్కు వాదనను ఉపసంహరించుకున్నాడు.

దీనివల్ల అబ్ద్ మనాఫ్ వారసుల మధ్య విభజన మరింత గాఢమైంది:

కూటమి 1బను హాశిం, బను ముత్తలిబ్. కూటమి 2 బను నవ్ఫల్, బను అబ్ద్ షమ్స్. ఈ కూటములు తరతరాల పాటు ప్రభావం చూపాయి.

**జమ్‌జమ్ బావి పునరావిష్కరణ:-**

మక్కా స్థాపనకు మూలమైన జమ్‌జమ్ బావి చాలా కాలంగా పూడిపోని, మరచిపోయిన స్థితిలో ఉండేది. యాత్రికులకు నీరు అందించే బాధ్యత అబ్దుల్ ముత్తలిబ్ చేతికి వచ్చినప్పుడు, ఒక స్వప్నం ప్రేరణతో ఆ బావిని వెతకాలని నిర్ణయించుకున్నాడు. అతను తన కుమారుడు హారిస్‌తో కలిసి అన్వేషణ ప్రారంభించాడు. అయితే ఖురైష్‌లో చాలామంది సహాయం చేయలేదు; కొందరు ఎగతాళి కూడా చేశారు. ఒంటరితనాన్ని అనుభవించిన అబ్దుల్ ముత్తలిబ్, దేవుడు తనకు పెద్దవారైన పది మంది కుమారులను ప్రసాదిస్తే వారిలో ఒకరిని దేవుని మార్గంలో బలి ఇస్తానని ప్రతిజ్ఞ చేశాడు. దీర్ఘకాల కృషి తరువాత అతను జమ్‌జమ్ బావి స్థానాన్ని కనుగొన్నాడు. తవ్వకాలలో బావితో పాటు, మక్కాను విడిచిపెట్టే ముందు జుర్హుం తెగ దాచిన నిధులు కూడా బయటపడ్డాయి. ఈ సంఘటన అబ్దుల్ ముత్తలిబ్ ప్రతిష్ఠను విపరీతంగా పెంచింది. క్రమంగా అతను ఖురైష్‌లో అత్యంత గౌరవనీయ నాయకుడిగా మారాడు.

**అబ్దుల్లాహ్ మరియు ప్రతిజ్ఞ:-**

జమ్‌జమ్ బావి పునరావిష్కరణ తర్వాత అబ్దుల్ ముత్తలిబ్ ప్రభావం మరింత పెరిగింది. కాలక్రమేణా అతనికి పది మంది కుమారులు కలిగారు. వారు పెద్ద వాళ్ళు అయిన తరువాత అతనికి తన ప్రతిజ్ఞ గుర్తొచ్చింది. అందరినీ కాబా వద్దకు తీసుకెళ్లి హుబల్ విగ్రహం ముందు చీట్లు వేశాడు. చీటి అతని అత్యంత ప్రియమైన, చిన్న కుమారుడు అబ్దుల్లాహ్ పేరున వచ్చింది. అతను తీవ్రంగా కలత చెందినప్పటికీ

**అహాదీస్ బోధనలు**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:
**"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."**
(కంజులుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671)

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)*

**అహాదీస్ బోధనలు**

**"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.**
(మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb*

తన ప్రతిజ్ఞను నెరవేర్చాలని నిర్ణయించుకున్నాడు. అబ్దుల్లాహ్ కూడా విధేయతతో అంగీకరించాడు. ఈ విషయం తెలుసుకున్న ఖురైష్ నాయకులు జోక్యం చేసుకున్నారు. ఒక జ్ఞానవంతుడి సలహా మేరకు అబ్దుల్లాహ్ మరియు పది ఒంటెల మధ్య చీట్లు వేయాలని నిర్ణయించారు.

**ఫలితాలు:-**

అబ్దుల్లాహ్ బదులుగా 10 ఒంటెలు ఫలితం అబ్దుల్లాహ్
అబ్దుల్లాహ్ బదులుగా 20 ఒంటెలు ఫలితం అబ్దుల్లాహ్
అబ్దుల్లాహ్ బదులుగా 30 ఒంటెలు ఫలితం అబ్దుల్లాహ్ ఇలా 40, 50, 60, 70, 80, 90 ఒంటెల వరకు పెంచినా ప్రతిసారి అబ్దుల్లాహ్ పేరే వచ్చింది. చివరకు 100 ఒంటెల వద్ద చీటి ఒంటెల పేరుపై పడింది.
నిశ్చయార్థం కోసం మరికొన్ని సార్లు చీట్లు వేయగా కూడా ఒంటెల పేరే వచ్చింది.

దీని ఫలితంగా: 100 ఒంటెలను బలి ఇచ్చారు. అబ్దుల్లాహ్ ప్రాణాలు రక్షించబడ్డాయి. ఆ సమయం నుండి ఖురైష్ సమాజంలో ఒక మనిషి రక్తపరిహారం (దియ్యా) 100 ఒంటెలుగా నిర్ణయించబడింది.

తరువాత అబ్దుల్లాహ్, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి తండ్రిగా ప్రసిద్ధి పొందాడు.

**ఏనుగు వారి కథ (అషాబుల్ ఫీల్):-**

అబ్దుల్ ముత్తలిబ్ కాలంలో యెమెన్ ప్రాంతం ఆఫ్రికాలోని ఎబిసీనియా (హబషా/ఇథియోపియా) రాజ్యాధీనంలో ఉండేది. ఆ కాలంలో ఎబిసీనియా ఒక శక్తివంతమైన రాజ్యంగా ప్రసిద్ధి చెందింది. ఎబిసీనియా క్రైస్తవ దేశం కావడంతో, యెమెన్ పాలకుడు కూడా క్రైస్తవుడే ఉండేవాడు. అబ్దుల్ ముత్తలిబ్ కాలంలో యెమెన్ గవర్నర్ పేరు అబ్రహా అల్-అష్రం.

అబ్రహాకు కాబాపై తీవ్రమైన ద్వేషం ఉండేది. అరబ్బులను కాబా నుండి దూరం చేయాలని అతడు కోరుకున్నాడు. అందుకోసం యెమెన్‌లో కాబాకు పోటీగా ఒక గొప్ప చర్చిని నిర్మించి, ప్రజలు కాబాకు వెళ్లి హజ్ చేయకుండా ఆ ప్రార్థనా మందిరానికే యాత్ర చేయాలని ప్రోత్సహించాడు. అయితే అరేబియా భూమిలో కాబాకు పోటీగా మరో పవిత్ర స్థలం ఏర్పడడాన్ని అరబ్బులు సహించలేకపోయారు. ఒక అరబ్ వ్యక్తి ఆగ్రహంతో ఆ చర్చిలోకి వెళ్లి దానిని అపవిత్రం చేశాడని చెప్పబడుతుంది. ఈ విషయం తెలుసుకున్న అబ్రహా కోపోద్రిక్తుడై మక్కాపై దండెత్తి కాబాను ధ్వంసం చేయాలని నిర్ణయించుకున్నాడు. అతడు ఎబిసీనియా రాజు నజాషీ (నెగస్) నుండి అనుమతి తీసుకుని, ఒక భారీ సైన్యంతో యెమెన్ నుండి బయలుదేరాడు. కొన్ని కథనాల ప్రకారం ఆ సైన్యంలో అరవై వేల మంది సైనికులు ఉన్నారని చెప్పబడుతుంది. మార్గమధ్యంలో అనేక అరబ్ తెగలను ఓడిస్తూ చివరకు మక్కా సమీపానికి చేరుకుని నగరం ముందు శిబిరం వేశాడు.అతని రాక గురించి ఖురైష్ తెగకు తెలిసినప్పుడు వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అంత పెద్ద సైన్యాన్ని ఎదుర్కొనే శక్తి తమకు లేదని వారికి తెలుసు. అందువల్ల వారు అబ్దుల్ ముత్తలిబ్‌ను తమ ప్రతినిధిగా అబ్రహా వద్దకు పంపారు.

అబ్దుల్ ముత్తలిబ్ యొక్క గౌరవప్రదమైన రూపం, ఉన్నతమైన వ్యక్తిత్వం అబ్రహాపై గొప్ప ప్రభావం చూపాయి. అతడు ఆయనను ఎంతో గౌరవంతో ఆహ్వానించాడు. ఒక అనువాదకుడి ద్వారా ఆయన ఏమి కోరుకుంటున్నారని అడిగాడు. అబ్దుల్ ముత్తలిబ్, అబ్రహా సైనికులు తన ఒంటెలను స్వాధీనం చేసుకున్నారని, వాటిని తిరిగి ఇవ్వాలని కోరాడు. అబ్రహా ఒంటెలను తిరిగి ఇవ్వమని ఆదేశించాడు. అయితే అబ్దుల్ ముత్తలిబ్ పట్ల అతనికి కలిగిన గౌరవం తగ్గిపోయింది. అతడు అసంతృప్తితో ఇలా అన్నాడు: "నేను మీ కాబాను కూల్చివేయడానికి వచ్చాను. కానీ నువ్వు దాని గురించి ఒక్క మాట కూడా మాట్లాడకుండా నీ ఒంటెల గురించే ఆలోచిస్తున్నావు." అప్పుడు అబ్దుల్ ముత్తలిబ్ ప్రశాంతంగా ఇలా సమాధానమిచ్చాడు: "అనా రబ్బుల్ ఇబిల్, వ లిల్ బైతి రబ్బున్ యమ్నఉహు." అనగా "నేను ఈ ఒంటెల యజమాని. అందుకే వాటి గురించి శ్రద్ధ వహిస్తున్నాను. కానీ ఈ గృహానికి (కాబాకు) కూడా ఒక యజమాని ఉన్నాడు. ఆయనే దీనిని రక్షిస్తాడు." ఈ సమాధానం విని అబ్రహా కోపంతో ఇలా అన్నాడు: "అయితే ఈ గృహపు యజమాని నన్ను ఎలా అడ్డుకుంటాడో నేను చూస్తాను." అతడు తన సైన్యంతో ముందుకు కదిలాడు. అయితే దైవ సంకల్పం ప్రకారం, అబ్రహా స్వారీ చేస్తున్న ఏనుగు మక్కా వైపు కదలడానికి నిరాకరించింది. ఎంత ప్రయత్నించినా అది ముందుకు సాగలేదు. కొద్దిసేపటికి ఆ సైన్యంపై ఒక మహా విపత్తు వచ్చి పడింది.

కొన్ని కథనాల ప్రకారం, పక్షుల గుంపులు ఆకాశంలో కనిపించి, తమ పంజాల్లో చిన్న చిన్న కాల్చిన మట్టి రాళ్లను తీసుకువచ్చాయి. అవి సైనికులపై పడడంతో వారికి మశూచి వంటి తీవ్రమైన అంటువ్యాధి సోకింది. ఒకసారి ఆ వ్యాధి సైన్యంలో వ్యాపించాక, అది వేగంగా ఒకరి నుండి మరొకరికి సోకింది. అంటువ్యాధులు కలుషిత కణాలు లేదా ఇతర మార్గాల ద్వారా వ్యాపించగలవు కాబట్టి, ఇది అసంభవం కాదు. పక్షులు వ్యాధి కారక పదార్థాలను మోసుకువచ్చి ఉండ వచ్చని కూడా భావించవచ్చు. అబ్రహా స్వయంగా కూడా ఒక తీవ్రమైన వ్యాధికి గురై, అతని శరీరం నుండి మాంసపు ముక్కలు ఊడిపడినట్లు కథనాలు చెబుతున్నాయి.

(తదుపరి సంచికలో)

**(12వ పేజీ తరువాత చదవగలరు)**

నూతన అహ్మదీయుల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక మరియు వేగవంతమైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, తద్వారా వారిని త్వరగా జమాఅత్ వ్యవస్థలో కలిసిపోయేలా చేయాలని హుజూర్ సూచించారు.

మరొక ప్రశ్నకు సమాధానంగా హుజూర్ ఇలా పేర్కొన్నారు: "ఒక నాసిర్ లేదా ఖాదిమ్ తన అనుబంధ సంస్థకు చందా బకాయి ఉంటే, అతను ఆ సంస్థలో గానీ, జమాఅత్‌లో గానీ పదవిదారుడిగా సేవ చేయలేడు."

చందా చెల్లింపు అంశంను గురించి హుజూర్ మాట్లాడుతూ, విధిగావించబడిన చందాలను ప్రతి వ్యక్తి తన ఆదాయానికి అనుగుణంగా ప్రతి నెలా క్రమం తప్పకుండా చెల్లించాలని చెప్పారు. చాలా మంది సంవత్సరం చివరి వరకు వేచి ఉండి చెల్లిస్తారు. ఆదాయం నెలనెలా వస్తే, చందా కూడా నెలనెలా చెల్లించాలి. ఒకవేళ ఎవరికైనా నిజమైన ఇబ్బందుల కారణంగా నిర్ణయించిన నిష్పత్తి ప్రకారం చెల్లించడం సాధ్యం కాకపోతే, వారు అధికారికంగా మినహాయింపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

హుజూర్ మరల ఇలా అన్నారు: "కొంతమందికి నాలుగు లేదా ఆరు నెలలకు ఒకసారి మాత్రమే ఆదాయం వస్తుంది. వారి పరిస్థితి భిన్నంగా ఉంటుంది. కావున వారు ఆదాయం వచ్చినప్పుడు ఆ కాలానికి సంబంధించిన మొత్తం చందాను ఒకేసారి చెల్లించవచ్చు. అయితే, క్రమం తప్పకుండా నెలవారీ ఆదాయం పొందే వారు మాత్రం ప్రతి నెలా చందా చెల్లించాలి."

హుజూర్ మరల ఇలా పేర్కొన్నారు: "వసియ్యత్‌కు సంబంధించిన చందా తగ్గించబడదు. మాఫీ చేయబడదు. అందులో ఎటువంటి తగ్గింపు అనుమతించబడదు."

హుజూర్ మరల ప్రత్యేకంగా ఇలా చెప్పారు: "చందా అనేది పన్ను (టాక్స్) కాదని మీరు ప్రజలకు తెలియజేయాలి. అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లోని బఖరా అధ్యాయపు ప్రారంభంలోనే దీనిని ప్రస్తావించాడు:

الَّذِينَ يُؤْمِنُونَ بِالْغَيْبِ وَيُقِيمُونَ الصَّلٰوةَ وَمِمَّا رَزَقْنٰهُمْ يُنْفِقُونَ (البقرة:4)

అనగా 'అదృశ్య విషయాలను విశ్వసించుతారు, నమాజును స్థాపించుతారు, మేము వారికి ప్రసాదించిన దానిలో నుండి ఖర్చు చేయుదురు. (బఖరా :4) ఇక్కడ అల్లాహ్ తఆలా వివరించినదేమనగా, విశ్వాసులు తమ విశ్వాసంను బలపరచుకోవడానికి, నిష్కాపరతను పొందడానికి మరియు అల్లాహ్ ప్రీతిని పొందడానికి ఆర్థిక త్యాగాలు చేస్తారు. కాబట్టి ఈ ఆర్థిక త్యాగం అనేది పన్ను చెల్లింపు కాదు. అంతేకాక, ఈ సూక్తిలో మరో అర్థం కూడా ఉంది. అల్లాహ్ మనుషులకు ప్రసాదించిన జ్ఞానం, ప్రతిభ, సామర్థ్యాలన్నింటినీ ధార్మిక సేవ కోసం మరియు దేవుని ప్రసన్నతను పొందేందుకు వినియోగిస్తారు." (తదుపరి సంచికలో)

**(అల్ ఫజల్ ఇంటర్నేషనల్, 13-19 డిసెంబర్ 2013.)**

---

**(1వ పేజీ తరువాత తఫ్సీర్ )**

హుజూర్ (అ) ఇలా తెలిపారు: సున్నత్ అనేది ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా నిరంతరం ఆచరించిన మరియు ఇతరులను కూడా ఆచరించమని ప్రోత్సహించిన కార్యాచరణ. అయితే హదీస్ అనేది ప్రవక్త (స)పలికిన మాటలు లేదా చేసిన బోధన. ఈ ఐదు సూత్రాల ద్వారా హుజూర్ (అ) ఎంత గొప్ప సంస్కరణ చేశారో ఇప్పుడు గమనించండి. మొదటిగా, వారు (అ) పవిత్ర ఖుర్‌ఆన్‌ను అత్యున్నత స్థానంలో ఉంచారు. ఎందుకంటే అది అల్లాహ్ యొక్క వాక్కు, సంపూర్ణమైనది, విశదీకరించబడినది మరియు పరిపూర్ణమైనది. దానిలో ఎటువంటి మార్పు జరగలేదు, జరగదు, ఎవరూ మార్పు చేయలేరు. ఎందుకనగా దాని సంరక్షణకు స్వయముగా అల్లాహ్‌యే హామీ ఇచ్చాడు. అలాంటి గ్రంథం కంటే అధిక ప్రామాణికత కలిగినది ఇంకేముంటుంది?. తరువాత సున్నత్ వస్తుంది. సున్నత్ కేవలం మాటల వరకే పరిమితమై ఉండకుండా, అది కార్యాచరణలతో అనుబంధమై ఉంటుంది. మరియు ఆ కార్యాచరణ కూడ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా నిరంతరం ఆచరించి చూపిన కార్యాలు. వేలాది మంది ప్రవక్త (స) కార్యచరణలను చూశారు మరియు వాటిని అనుసరించారు. అంతేగాని ఒకరు, ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు 'ప్రవక్త (స) ఇలా చెప్పడం మేము విన్నాము' అని సాక్ష్యమివ్వడం మాత్రమే కాదు. వేలాది మంది ప్రజలు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విధంగా ఆచరిస్తుండగా చూస్తూ, వారి (స)ని అనుసరిస్తూ, అదే విధముగా ఆచరించి చూపిన ఆచరణలు. అందువల్ల ఈ సున్నత్‌లో పొరపాటు సంభావ్యత చాలా తక్కువగా ఉంటుంది. కొద్దిమంది వ్యక్తుల సాక్ష్యంపై ఆధారపడే హదీస్‌ల కంటే ఇది ఎంతో ఉన్నతమైనది. హుజూర్ (అ) ఆ తరువాత హదీస్‌కు స్థానం కల్పించారు. అయితే ఒక ముఖ్యమైన షరతును విధించారు: హదీస్‌ల విశ్వసనీయతను కేవలం వాటిని వర్ణించిన వ్యక్తుల నిజాయితీని ఆధారంగా చేసుకొని నిర్ణయించకూడదు. నిజానికి ఆయ కథనాల వాస్తవికత పవిత్ర ఖుర్‌ఆన్, సున్నత్ మరియు ప్రకృతి నియమాలకు అనుగుణంగా ఉండాలి."

**(హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి సేవలు, అన్వార్-ఉల్-ఉలూమ్, సంపుటి 10, పుటలు 178--179.)**

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail:
teluguweeklybadar@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 25 JUN 2026, Issue No - 26

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

# సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.

**19 అక్టోబర్, శనివారం, 2013:- (గత సంచిక తరువాత)**

**హుజూరే అన్వర్ గారితో ఖుద్దాముల్ అహ్మదియ్యా ఆస్ట్రేలియా జాతీయ మజ్లిస్ కార్యవర్గం సమావేశం:-**

శ్రమాదాన కార్యదర్శిని ఉద్దేశించి హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా గారు ఇలా అన్నారు: "ఈ మస్జిద్‌కు చాలా విస్తారమైన ప్రదేశం ఉంది, సుమారు ముప్పై ఎకరాలు. ఇక్కడ ఖుద్దామ్ గడ్డి కోయడం, చెట్లు, పూల మొక్కలు నాటడం వంటి పనులు చేస్తారా?" అందుకు కార్యదర్శి ' అవసరమైన యంత్రాలను సమకూర్చుకోని, మేము గడ్డి కోస్తాము, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతాము, అలాగే తోటపని కూడా నిర్వహిస్తాము' అని సమాధానం ఇచ్చారు.

తహ్‌రీకే జదీద్ కార్యదర్శిని ఉద్దేశించి హుజూర్ ఇలా అడిగారు: "మీ జమాఅత్ ఖుద్దాముల్ అహ్మదియ్యా కోసం ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించింది? ఖుద్దామ్ కోసం ప్రత్యేక లక్ష్యం ఉండాలి. ఈ సంవత్సరం ఖుద్దామ్ ఎంత మొత్తంలో తహ్‌రీకే జదీద్ చందా సేకరించారు? లేక ప్రతి ఖాదిమ్‌ను తహ్‌రీకే జదీద్ ఆర్థిక వ్యవస్థలో చేర్చారా?" అందుకు సెక్రటరీ, ఖుద్దామ్-ఉల్-అహ్మదియ్యా కోసం ప్రత్యేక లక్ష్యం ఏదీ లేదని తెలిపారు. అప్పుడు హుజూర్ ఇలా అన్నారు: "ఖుద్దామ్ కోసం ప్రత్యేక లక్ష్యం కూడా నిర్దేశించాలి."

సెక్రటరీ అత్ఫాల్ తన నివేదికను సమర్పిస్తూ, ఇది తన పదవిలో మొదటి సంవత్సరం అని పేర్కొన్నారు. దానికి హుజూర్ ఇలా సలహా ఇచ్చారు: "మీ పనిని సక్రమంగా నిర్వహించండి. అత్ఫాల్ నుండి వక్ఫ్-ఎ-జదీద్ చందాను కూడా సేకరించండి. ప్రతి బాలుడిని ఈ పథకంలో చేర్చండి."

సెక్రటరీ తబ్లీఘ్ (ప్రచారం మరియు ధర్మబోధన) ను ఉద్దేశించి హుజూర్ బైఅత్‌ల గురించి అడిగారు. అందుకు సెక్రటరీ సమాధానమిస్తూ, ఈ సంవత్సరంలో కేవలం ఒక బైఅత్ మాత్రమే జరిగిందని, అది ఎవరిదో లేదా వారు ఏ జాతికి చెందినవారో తనకు ఇంకా తెలియదని చెప్పారు.

అందుకు హుజూర్ స్పందిస్తూ: "మొదటగా, ఖుద్దామ్-ఉల్-అహ్మదియ్యాకు సంవత్సరం మొత్తంలో ఒక్క బైఅత్ మాత్రమే చేయించడం జరిగింది. రెండవది, మూడు నెలలు గడిచినా అది ఎవరిదో మీకు ఇంకా తెలియదా?"

అనంతరం హుజూర్ ఇలా సూచించారు: "మీ పనిని క్రమబద్ధంగా నిర్వహించండి. ఇప్పుడు మీరు ఒక సంవత్సరంలో 25 బైఅత్‌లు చేయించాలి. కావున నేటి నుంచే కృషి చేయడం ప్రారంభించండి. సరైన కార్యక్రమం, ప్రణాళిక మరియు వ్యూహాన్ని రూపొందించండి. తబ్లీఘ్ పనిని వ్యవస్థీకృతంగా నిర్వహించి, ప్రతి మజ్లిస్‌కు తబ్లీఘ్ చేయడం మరియు బైఅత్‌లు చేయించడం అనే బాధ్యతను అప్పగించండి."

స్థానిక వ్యవహారాల కార్యదర్శి (సెక్రటరీ ముకామీ) ఉద్దేశించి హుజూర్, నీ బాధ్యత కేవలం మస్జిద్ పరిసరాలకే పరిమితమా లేక మొత్తం గ్రేటర్ సిడ్నీకి వర్తిస్తుందా అని అడిగారు.అందుకు సెక్రటరీ, మొత్తం సిడ్నీ తన పరిధిలో ఉందని తెలిపారు.

అందుకు హుజూర్ ఇలా ఆదేశించారు: "మీ పరిధిని మస్జిద్ చుట్టూ పది మైళ్ల వరకు మాత్రమే పరిమితం చేయండి. మిగిలిన సిడ్నీలో ప్రత్యేక మజాలిస్ మరియు నిర్వాహకులను ఏర్పాటు చేయండి. మస్జిద్ చుట్టూ ఉన్న పది మైళ్ల ప్రాంతానికి మీరు బాధ్యత వహించాలి, మిగతా ప్రతి మజ్లిస్‌కు దాని స్థానిక ఖాయిద్ బాధ్యత వహించాలి. ఇలా చేస్తే పని మరింత సమర్థవంతంగా మరియు చురుకుగా జరుగుతుంది."

ఆడిటర్ (ముహాసిబ్) తన నివేదికను సమర్పిస్తూ, తాను ఇటీవలే ఈ బాధ్యతను స్వీకరించానని, ఇంకా పనిని నేర్చుకుంటున్నానని చెప్పారు. అందుకు హుజూర్ ఇలా వ్యాఖ్యానించారు: "మీరు ఇంకా మీరే పనిని అర్థం చేసుకునే ప్రయత్నంలో ఉంటే, ఇతరులకు ఎలా వివరించగలరు?"

విద్యార్థి వ్యవహారాల కార్యదర్శిని ఉద్దేశించి హుజూర్ ఇలా అన్నారు: "మీ విద్యార్థులను సక్రమంగా తీర్చిదిద్దండి. విశ్వవిద్యాలయాలలో 'అహ్మదియ్యా ముస్లిం స్టూడెంట్ అసోసియేషన్లు' స్థాపించండి. ఈ సంఘాలు వివిధ విశ్వవిద్యాలయాలు మరియు కళాశాలల్లో అనేక అంశాలపై సదస్సులు నిర్వహించవచ్చు. మతపరమైన మరియు ఆధ్యాత్మిక అంశాలతో పాటు పరిశోధన మరియు విద్యాసంబంధిత అంశాలను కూడా చేర్చవచ్చు. దీని ద్వారా తబ్లీఘ్‌కు అవకాశాలు ఏర్పడతాయి మరియు జమాఅత్ గురించి అవగాహన కూడా పెరుగుతుంది."

నూతన అహ్మదీయుల శిక్షణ కార్యదర్శి నివేదికను సమర్పిస్తూ, ప్రస్తుతం పదకొండు మంది కొత్త సభ్యులు శిక్షణలో ఉన్నారని తెలిపారు. వారిలో ఏడుగురు సిడ్నీకి చెందిన వారు కాగా, మిగిలిన వారు దూర ప్రాంతాల మజాలిస్‌లకు చెందిన వారని చెప్పారు. అందుకు హుజూర్ ఇలా అడిగారు: "వారందరితో మీకు వ్యక్తిగత సంబంధం ఉందా?" దానికి సెక్రటరీ, స్థానిక ఖాయిద్‌లు వారితో నిరంతర సంబంధాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. వారిలో నలుగురు పాకిస్తాన్‌కు చెందిన వారు కాగా, మరికొందరు భారతదేశం మరియు శ్రీలంకకు చెందినవారని చెప్పారు.

అందుకు హుజూర్ ఇలా అన్నారు: " తమిళ భాషలో కూడా మన జమాఅత్ లిటరేచర్ అందుబాటులో ఉంది. వారికి వాటిని అందించండి. వారందరితో నిరంతర సంబంధం కొనసాగించండి మరియు వారిని అధికారికంగా జమాఅత్ వ్యవస్థలో భాగసామ్యులుగా తీర్చిదిద్దాలి."

సెక్రటరీ ఇషాఅత్ (ప్రచురణలు) ను ఉద్దేశించి హుజూర్ ఖుద్దామ్ పత్రిక గురించి అడిగారు. దానికి సెక్రటరీ ఇలా సమాధానమిచ్చారు: "మేము 'అల్-మస్రూర్' అనే పత్రికను ప్రచురిస్తున్నాము."

అందుకు హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) ఈ క్రింది మార్గదర్శకాలను ఇచ్చారు:

తబ్లీగ్ (ప్రచారం) కోసం నిర్ధిష్టమైన మరియు ప్రభావవంతమైన కార్యక్రమాన్ని రూపొందించండి, నిర్ధిష్టమైన లక్ష్యాలను నిర్ణయించండి, ఆపై వాటి పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించి అనుసరించండి.

అలాగే, మీరు ఏర్పాటు చేసే ఏ శిక్షణ కార్యక్రమంలోనైనా నమాజ్ స్థాపన మరియు పవిత్ర ఖుర్ఆన్ పఠనం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఎంటిఏలో ప్రసారమయ్యే జుమా ప్రసంగాన్ని ఎంతమంది ఖుద్దామ్ (ఖుద్దాముల్ అహ్మదియ్య సభ్యులు) వింటున్నారో మీరు ఎప్పుడైనా పరిశీలించారా? హుజూర్ అమిలా (కార్యవర్గ) సభ్యులను ఉద్దేశించి, నెలలో కనీసం మూడు జుమా ప్రసంగాలను విన్నవారు చేతులు ఎత్తమని కోరారు. అందరూ తమ చేతులు ఎత్తారు. వారిలో ఎంతమంది తమ కుటుంబ సభ్యులతో కలిసి జుమా ప్రసంగాలను వింటున్నారో కూడా హుజూర్ అడిగి తెలుసుకున్నారు.

హుజూర్ మరల ఇలా సూచించారు. సెలవు రోజులలో సభ్యులు తమ ఇళ్లలో తమ పిల్లలకు తరగతులు నిర్వహించి వారికి ధార్మిక జ్ఞానాన్ని బోధించాలి.

ఎన్ని సంవత్సరాల వరకు నూతన అహ్మదీయులుగా కొనసాగుతారు? అనే ప్రశ్నకు సమాధానంగా హుజూర్ ఇలా అన్నారు:

"నేను నా సమావేశాలలో మరియు ఇతర కార్యక్రమాలలో సంవత్సరానికి దాదాపు పది సార్లు "మూడు సంవత్సరాల వరకు " అని చెబుతుంటాను."

హుజూర్ ఇలా పేర్కొన్నారు: "ఎవరైనా బైఅత్ చేస్తే అతను అహ్మదీయే. అలాంటి వ్యక్తి త్వరగా జమాఅత్ సభ్యులతో మమేకమై జమాఅత్ వ్యవస్థలో కూడ భాగసామ్యులు కావాలి."

హుజూర్ మరల ఇలా పేర్కొన్నారు: అనేక మంది బైఅత్ చేయడం వల్ల, కొత్తగా బైఅత్ చేసినవారి కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ మూడు సంవత్సరాల కాలంలో వారికి సరైన శిక్షణ ఇచ్చి, వారిని చూసుకుని, జమాఅత్ యొక్క సాధారణ సంస్థాగత వ్యవస్థలో భాగసామ్యులను చేయడమే దాని ఉద్దేశ్యం.

హుజూర్ ఒక ఉదాహరణగా యునైటెడ్ కింగ్‌డమ్‌లోని యువ ఇంగ్లీష్ వ్యక్తి జోనాథన్ బట్టర్వర్త్ గురించి ప్రస్తావించారు. అతను రెండు సంవత్సరాల క్రితం అహ్మదియ్యత్‌ను స్వీకరించాడు. ఇప్పుడు అతను ఎంటిఏ కార్యక్రమాలలో పాల్గొంటున్నాడు మరియు ఈ సంవత్సరం యూకే నేషనల్ అమిలాలో నూతన అహ్మదీయుల కోసం తర్బియత్ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. ఎవరైనా సరైన శిక్షణ పొంది సిద్ధమైతే, వారిని జమాఅత్ వ్యవస్థలోకి తీసుకువచ్చి వారికి బాధ్యతలు అప్పగించవచ్చని హుజూర్ తెలిపారు.

**(11వ పేజిలోని 2వ కాలంలో చదవగలరు)**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz